J/NELLORE/003/21-23 R.N.I.No.25359/74 పేజీలు : 12

THE BEST TELUGU WEEKLY OF NELLOREANS






# లాయర్

సంపుటి : 41 సంచిక : 33 21.1.2022, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

## సిఎం Vs సిబ్బంది...

# తగ్గేదే లే...

### నువ్వా నేనా అన్న వాదం
### ముదురుతున్న వివాదం
### తగ్గకుంటే ప్రమాదం

అనుకున్నంతా అవుతోంది. పీఆర్సీ, తదితర అంశాలపై తమ డిమాండ్ల సాధనకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘాలు శుక్రవారం నాడు ప్రభుత్వానికి సమ్మె నోటీసును జారీ చేస్తున్నాయి. సమ్మెకు ముందుగా పదిహేను రోజుల నోటీస్ ఇవ్వాల్సి ఉంటుంది. రాష్ట్రంలోని పలురకాల ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నేతలతో కూడిన 'ఐక్య కార్యాచరణ సమితి (జేఏసీ)' ఈ మేరకు నిర్ణయించింది.

ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన తరువాత తొలిసారిగా ప్రభుత్వద్యోగులు సమ్మె నోటీస్ జారీ చేస్తున్నారు. పీఆర్సీకి కమిటీ నియమించిన తరువాత ఆ నివేదిక ఆలస్యం అవుతుందనే భావనతో ప్రభుత్వాలు ఇంటీరియం రిలీఫ్(మధ్యంతర భృతి) ప్రకటించడం ఒక ఆనవాయితీగా వస్తోంది. అలాగే, ముఖ్యమంత్రిగా జగన్ అధికారం చేపట్టగానే మూలవేతనం(బేసిక్ పే)పై 27 శాతం మొత్తాన్ని ఇంటీరియం రిలీఫ్‌గా ప్రకటించారు.

ఇక, పే రివిజన్ కమిషన్ నివేదిక కోసం ఉద్యోగులు ఎదురుతెన్నులు చూడడం మొదలైంది. పే రివిజన్ కమిషన్ సిఫారసులు ఇంటీరియం రిలీఫ్ కంటే సహజంగానే ఎక్కువ ఉంటాయి. దాంతో పీఆర్సీ నివేదిక వస్తే, తమ జీతభత్యాలు బాగా పెరుగుతాయనే అంచనాలో ఉద్యోగులు ఉన్నారు. పెరిగిన జీతభత్యాలకు సంబంధించిన అరియర్స్ కూడా గణనీయంగా చేతికి అందుతాయని వారు ఆశపడ్డారు. అయితే, వారి అంచనా ఒకటైతే జరిగింది మరొకటి.

3 లో

పాఠకులకు, ప్రకటనకర్తలకు, చందాదారులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు
గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు
సం/-

- మాగుంట లే అవుట్

## విజ్ఞాన పార్కుకి వివాదాల విఘ్నాలు

> ప్రభుత్వం పక్కా ఆధారాలు చూపించినా సంతృప్తి చెందని అక్రమార్కులు

10లో




సునామీలా...

## దూసుకొస్తున్న కరోనా

> రోజూ లక్షల్లో కేసులు
విలవిలలాడుతున్న బాధితులు

కరోనా రాకాసి కరాళనృత్యం చేస్తోంది. దాని దెబ్బకు ప్రపంచమే గడగడ వణికిపోతోంది. తగ్గిపోతుందిలే అనుకున్న ఈ మాయదారి వ్యాధి ఇక తగ్గేదే లే.. అంటూ వికటాట్టహాసం చేస్తోంది. కరోనా టెస్టులు జరుగుతూనే ఉన్నాయి, సూదులు వేసుకుంటూనే ఉన్నారు. జాగ్రత్తలన్నీ తీసుకుంటూనే ఉన్నారు. కానీ వేటినీ ఆ మహమ్మారి లెక్కచేయడం లేదు. రంగులు రూపాలు మారుస్తూ.. ఎవరి కంటికీ కనిపించకుండా కనిపించినవారినల్లా కాటేసుకుంటూపోతోంది.

10 లో

- సినిమా గోల

## విందుతో మెగా మందు

> జగన్ - చిరుల లంచ్‌తో కంచికి చేరిన కథ

10లో






## ఇంటికి తాళం వేసి వెళ్తే..
# ఇంతే సంగతులు

○ కనిపెట్టి దోచుకుపోతున్న 'ఇళ్ళ దొంగలు'

○ వరుస చోరీలతో జనం బెంబేలు

**తాళం వేసిన ఇళ్లల్లో నిర్భయంగా జొరబడి చోరీలు చేసే దొంగలు జిల్లాలో గత కొద్దిరోజులుగా వీర విహారం చేస్తున్నారు. రాత్రివేళల్లో వచ్చి తాళాలు పగులగొట్టి ఇళ్ళల్లోకి దూరి ఉన్నదంతా ఊడ్చుకుపోతున్నారు. దీంతో జనం బెంబేలెత్తిపోతున్నారు. ఇలాంటి దొంగతనాలకు అలవాటుపడ్డ దొంగలెవరో ఎంతో చాకచక్యంగా చోరీలు చేసేస్తున్నారనీ, ప్రతిరోజూ ఎక్కడో ఒకచోట ఈ చోరీలు జరుగుతూనే ఉన్నాయని, తాళం వేసిన ఇళ్ళను గుర్తించి నిర్భయంగా దొంగతనాలు చేస్తున్నారని, జిల్లా పోలీసు ఉన్నతాధికారులు వెంటనే ఇలాంటి చోరీలపై దృష్టి సారించి ప్రత్యేకబృందాలతో నిఘా పెట్టి దొంగల భరతంపట్టాలని ప్రజలు కోరుకుంటున్నారు.**


చోరీకి గురైన ఇంటిని పరిశీలిస్తున్న పోలీసులు

ఇటీవల సంగం మండలంలోని జెండాదిబ్బ గ్రామంలో జలీల్‌ఖాన్ తన కుటుంబంతో కలసి అత్తగారింటికి వెళ్తే, తిరిగొచ్చేసరికి ఇంటి తాళాలు, లోపల బీరువా అన్నిటినీ పగులగొట్టి 5 సవర్ల దాకా బంగారునగలు, 40వేల డబ్బు దోచుకుపోయారు. అదేవిధంగా బుర్రె సాహెబ్ ఇంటితాళాలు కూడా పగులగొట్టి లోపలున్న 5 సవర్ల బంగారు, 20వేల రూపాయలు అపహరించుకుపోయారు. ఈనెల 15వ తేది రాత్రి కావలి పట్టణం నడిబొడ్డులో ఉన్న టిటిడి కల్యాణమండపం ఎదురుగా ఉన్న మెంటా మోహనరావు నివాసంలోనూ చోరీ జరిగింది. తమ షాప్‌కు వెనుకవైపున ఉన్న ఇంటికి తాళం వేసి మిద్దెపైన గదిలో మోహనరావు నిద్రపోయారు. తెల్లారి లేచి చూసేసరికి ఇంటి తాళం పగులగొట్టి ఉండడాన్ని గుర్తించి లోపలికి వెళ్ళి చూస్తే.. ఇంకేముందీ సుమారు 2.20 లక్షల బంగారు నగలు, లక్షా 80 వేల నగదు మాయమయ్యాయి. దీంతో బాధితులు లబోదిబోమంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈనెల 15వ తేదీన్నే కోవూరు పక్కనున్న పడుగుపాడులోని వాగుమిట్ట ప్రాంతంలో మరో ఇంటి తాళాలు పగులగొట్టి దొంగలు దోచుకుపోయారు. అక్కడ నివాసం ఉండే హరిప్రసాద్ కుటుంబీకులు ఇంటికి తాళాలు వేసి ఊరికెళ్ళారు. తిరిగొచ్చేసరికి దొంగలు తమ పని కానిచ్చేశారు. ఇంట్లో బీరువాలో దాచిపెట్టుకున్న తొమ్మిదిన్నర సవర్ల బంగారునగలు దొంగలు దోచుకుపోయారంటూ గోడుగోడుమంటూ పోలీసులకు మొరపెట్టుకున్నారు. పోలీసులు ఈ కేసులన్నిటినీ అన్నికోణాల్లో పరిశోధిస్తున్నారు. క్లూస్‌టీంలతో వచ్చి చోరీలు జరిగిన ఇళ్ళను పరిశీలిస్తున్నారు. దొంగల ఆచూకీ కనిపెట్టేందుకు దర్యాప్తు ముమ్మరం చేస్తున్నారు.

### సూళ్ళూరుపేటలో ఆరుసవర్ల నగలు హాంఫట్

ఇంటికి తాళం వేసి పక్కింట్లో వెళ్ళి పడుకున్నా కూడా దొంగలు వదలడం లేదు. జాగ్రత్తగా గమనించి తాళం వేసివున్న ఇంట్లోకి వెళ్ళి తలుపుల తాళాలు, ఇంట్లో బీరువా పగులగొట్టి నగలు దోచుకుపోయారు. సూళ్ళూరుపేట బాపూజీకాలనీలో ఈనెల 17వ తేది అర్ధరాత్రి వేళ ఈ చోరీ జరిగింది. అక్కడ నివాసం ఉంటున్న నిషార్ అనేవ్యక్తికి రెండు ఇళ్ళున్నాయి. అవి పక్కపక్కనే ఉన్నాయి కూడా. ఒక ఇంటికి తాళం వేసి మరో ఇంట్లో నిద్రపోయాడు నిషార్. తెల్లారి లేచి చూసుకునేసరికి అంతా జరిగిపోయింది. ఇంట్లో బీరువాను కూడా పగులగొట్టి ఆరుసవర్ల బంగారు నగలు దొంగిలించుకుపోయారంటూ నిషార్ లబోదిబోమంటూ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు వెంటనే రంగంలోకి దిగి చోరీ జరిగిన ఇంటిని పరిశీలించి వేలిముద్రల నిపుణులను రప్పించి, దొంగల ఆచూకీకై గాలిస్తున్నారు.

# శ్రీహరికోట లేబర్‌కాలనీలో.. ఇద్దరు ఆత్మహత్య

**క్షణికావేశంలో ఉరేసుకుని చనిపోయారు**

చిన్న విషయాలను కూడా ఓర్చుకోలేక క్షణికావేశానికి గురై జీవితాలను అంతం చేసుకున్న ఒక యువకుడు, మరో యువతి విషాద గాథ ఇది. శ్రీహరికోటలోని చెంగల్‌పాళెం లేబర్‌కాలనీలో ఇటీవల జరిగిన రెండు వేర్వేరు సంఘటనల్లో చిన్న విషయాలతోనే గొడవపడి వారిరువురు ఆత్మహత్య చేసుకున్నారు. కనుమ పండుగ రోజునే జరిగిన ఈ సంఘటనలు స్థానికులను కలచివేశాయి. మద్యం తాగినందుకు తండ్రి తనను అందరిముందు తిట్టాడన్న కోపంతో ఒక యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ప్రేమించి పెళ్ళి చేసుకున్నవాడే రోజూ మద్యం తాగొచ్చి హింసిస్తున్నాడంటూ ఒక యువతి ఆత్మహత్య చేసుకుంది. ఈ రెండు సంఘటనలు ఒకే రోజు అదే కాలనీలో జరిగాయి. పోలీసుల సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. శ్రీహరికోట సమీపంలోని లేబర్‌కాలనీలో సింహాద్రి హరికృష్ణ అనే యువకుడు మద్యం తాగి చిందులేస్తుండడంతో తండ్రి మందలించాడు. అందుకు అవమానంగా భావించిన ఆ యువకుడు కొద్దిదూరంలో చెట్టుకు ఉరేసుకుని మృతి చెందాడు. అదే కాలనీకి చెందిన దర్శిని (24) అనే యువతి భర్త తాగొచ్చాడని గొడవ పడడంతో భర్త ఆమెపై చేయి చేసుకున్నాడు. దీంతో విరక్తిచెందిన ఆమె ఇంట్లోనే ఉరివేసుకుని చనిపోయింది. ఈ దంపతులకు మూడేళ్ళ కొడుకు ఉన్నాడు. ఆమె గర్భిణి అని కూడా సమాచారం. క్షణికావేశంలో జీవితాలను అంతం చేసుకున్న వారిరువురి మృతదేహాలను చూసి స్థానిక ప్రజలు కంటతడిపెట్టుకున్నారు. శ్రీహరికోట ఎస్ఐ రోజాలత ఈ కేసులను దర్యాప్తు చేస్తున్నారు.


ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న దర్శిని

## పొట్టేపాళెంలో కన్నులపండువగా వైకుంఠ ఏకాదశి



నెల్లూరు రూరల్ మండలంలోని పొట్టేపాళెం గ్రామంలో కొలువైవున్న శ్రీ కోదండరామస్వామి దేవాలయంలో ఈ నెల 13న వైకుంఠ ఏకాదశి ఘనంగా జరిగింది. స్వామివారికి ఉదయం ప్రత్యేకపూజలు నిర్వహించి, భక్తులను ఉత్తర ద్వారం ద్వారా స్వామివారిని దర్శించుకునేందుకు అవకాశం కల్పించారు. సాయంత్రం స్వామివారికి గరుడసేవ నిర్వహించారు. ఆలయ ఛైర్మెన్ పొన్నాల రామచంద్రారెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. సురేష్‌రెడ్డి – ఉమా దంపతులు, అడపాల శ్రీనివాసులురెడ్డి – శైలజమ్మ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివార్లను దర్శించుకున్నారు.

# పిఆర్‌సి జీఓలపై వెల్లువెత్తిన నిరసనలు

## సర్వత్రా ఉద్యోగుల ఆందోళనలు



ప్రభుత్వం జారీచేసిన పిఆర్‌సి జీఓలు సముచితంగా లేవంటూ జిల్లాలో ఉద్యోగులు సర్వత్రా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆ జీఓల పట్ల ఉద్యోగ సంఘాలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశాయి. ఈనెల 18న ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు పెట్టుకుని నిరసన తెలియజేస్తూ విధులకు హాజరయ్యారు. మధ్యాహ్నం భోజన విరామసమయంలో ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ కార్యాలయాల ఎదుట నిరసన తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఉద్యోగులు నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరయ్యారు. నగరంలోని గాంధీబొమ్మ కూడలి వద్ద నల్లబ్యాడ్జీలు ధరించి నిరసనలు తెలిపారు. పలు మండలాల్లో ఉద్యోగ సంఘాల నాయకులు ఆ జీఓల ప్రతులను దగ్ధం చేశారు. ప్రస్తుతం ఇస్తున్న ఐఆర్ కంటే తక్కువగా 23 శాతం ఫిట్ మెంట్‌తో ప్రభుత్వం జీఓలు ఇవ్వడాన్ని ఉద్యోగ సంఘాల నాయకులు వ్యతిరేకించారు. ఉద్యోగుల ప్రయోజనాలకు వ్యతిరేకంగా ఉండే ఆ జీఓ లను వెంటనే రద్దుచేసి మెరుగైన పిఆర్‌సి ప్రకటించాలని వారు డిమాండ్ చేశారు. ఏపిఆర్ఎస్ఏ జిల్లా అధ్యక్షుడు అల్లం పెంచల్‌రెడ్డి, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఎం.రవిబాబు తదితర నాయకులు ఈ నిరసనల్లో పాల్గొన్నారు.

# పెరుగుతున్న అక్షర చైతన్యం


○ నిరక్షరాస్యులు చదువరులవుతున్నారు

○ పరీక్షల్లో లక్షా 16వేల మంది పాసయ్యారు

జిల్లాలో అధికారుల కృషితో అక్షర చైతన్యం పెరుగుతోంది. అక్షరజ్ఞానం పెంపొందించేందుకు జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు ఆధ్వర్యంలో గత ఏడాది ఆగస్టు 1వ తేది నుంచి అధికారులు తీసుకుంటున్న చర్యలు సఫలీకృతమవుతున్నాయి. కనీసం అక్షరాలు రాయడం, చదవడం, అర్ధం చేసుకోవడం చేతకాక జిల్లాలో వేలాదిమంది నిరక్షరాస్యులు అనునిత్యం ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. ఈ నేపథ్యంలో వారిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దడానికి అధికారులు చేస్తున్న కృషి మంచి ఫలితాలనే ఇస్తుండడం సంతోషకరం. జిల్లాలో మొత్తం 1,33,438 మంది నిరక్షరాస్యులను గుర్తించారు. వారిలో 88,441 మంది మహిళలు, 44,997 మంది పురుషులు ఉన్నారు. వీరిని అక్షరాస్యులుగా చేసేందుకు, గ్రామాల్లో సచివాలయాల సిబ్బంది, వలంటీర్లు నిరంతరం కృషిచేస్తున్నారు. వారికి అవసరమైన బోధన పుస్తకాలను, ప్రత్యేక అభ్యసనా సామగ్రిని రాష్ట్ర వయోజన విద్యాశాఖతో సంప్రదించి సుమారు 36.85 లక్షల రూపాయల వ్యయంతో వయోజనులకు అందజేశారు. జిల్లాలో 8426 అక్షర కేంద్రాలను ఏర్పాటుచేశారు. దాదాపు ఆరునెలలు వారికి పాఠాలు బోధించి, విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, సార్వత్రిక విద్యాపీఠం సహకారంతో ఈనెల 8న పరీక్షలు కూడా నిర్వహించారు. 1746 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తే 1,24,270 మంది హాజరైతే అందులో 1,16,566 మంది పాసయ్యారు. మొత్తంగా 93.8 శాతం ఉత్తీర్ణత సాధించారు. దీంతో ఉన్నతాధికారులు వచ్చే ఆగస్టు 1 నుంచి అక్షరచైతన్యం రెండోవిడత కార్యక్రమాన్ని ప్రారంభించి జిల్లాలో నూటికి నూరు శాతం అక్షరాస్యతను సాధించాలనే లక్ష్యంతో కృషిచేస్తుండడం హర్షదాయకం.

# కోళ్ళ వ్యర్థాల మాటున.. అక్రమ మద్యం

## 3 లక్షల విలువచేసే బ్రాందీసీసాల పట్టివేత


సెబ్ అధికారులకు పట్టుబడిన నిందితుడు, మద్యం సీసాలు

కోళ్ళ వ్యర్థాల మాటున మద్యం సీసాలు పెట్టుకుని జోరుగా అక్రమరవాణాకు పాల్పడుతున్న ఓ వ్యక్తి ఎట్టకేలకు సెబ్ అధికారులకు దొరికిపోయాడు. ఆ వ్యక్తి నుంచి కర్నాటక రాష్ట్రానికి చెందిన సుమారు 3 లక్షల రూపాయల విలువచేసే మద్యం బాటిళ్ళను సెబ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సెబ్ నెల్లూరు–2 స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు ఈనెల 16న ఆ వివరాలను తెలియజేశారు. వెంకటాచలం టోల్‌ప్లాజా వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ఓ మినీలారీలో కోళ్ళవ్యర్థాలున్న డ్రమ్ముల్లో బస్తాల్లో మూటలుకట్టి బ్రాందీ సీసాలు ఉండడాన్ని గుర్తించి వాటిని, ఆ లారీని స్వాధీనం చేసుకున్నామని, కోవూరులోని గుమ్మళ్ళదిబ్బ ప్రాంతానికి చెందిన డ్రైవర్ జి.శ్రావణ్‌కుమార్‌ను అరెస్టు చేశామని ఆయన చెప్పారు. లారీ యజమాని, మరో ఇద్దరు కలసి బెంగుళూరులో 450 బాటిళ్ళ మద్యాన్ని కొనుగోలు చేసి మనుబోలు వద్ద దిగిపోయి లారీని తీసుకువెళ్ళమన్నారని డ్రైవర్ చెప్పాడని, ఈ అక్రమరవాణాకు పాల్పడుతున్న ఆ ముగ్గురి కోసం గాలింపు చేపట్టామని చెప్పారు.

# తిరుపతి ఎంపీతో కిలివేటి భేటీ



నాళ్ళూరుపేట ఎమ్మెల్యే, తిరుమల తిరుపతి దేవస్థానాల పాలక మండలి సభ్యుడు కిలివేటి సంజీవయ్య ఈనెల 16న తిరుపతిలోని ఎంపి గురుమూర్తి నివాసంలో ఆయన్ను మర్యాదపూర్వకంగా కలుసుకుని సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. శాలువాతో ఎంపీని సత్కరించి శ్రీవేంకటేశ్వరస్వామి జ్ఞాపికను అందజేశారు. అనంతరం పలు విషయాలను చర్చిస్తూ సూళ్ళూరుపేట అభివృద్ధికి నిధులు మంజూరుచేయాలని ఎంపీని కోరారు. అందుకు స్పందించిన ఎంపీ గురుమూర్తి సూళ్ళూరుపేట నియోజకవర్గం అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని చెప్పారు.

# అంగరంగ వైభవం.. మల్లేశ్వరస్వామి తెప్పోత్సవం

- **వేలాదిగా తరలివచ్చిన భక్తజనం**



సంక్రాంతి పండుగ సందర్భంగా నెల్లూరు మైపాడురోడ్డులోని జాఫర్‌సాహెబ్ కాలువ ఘాట్‌లో భ్రమరాంబాదేవి సమేత శ్రీ మల్లేశ్వరస్వామి తెప్పోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. వేలాదిమంది భక్తులు ఈ ఉత్సవానికి విచ్చేసి స్వామివార్లను దర్శించుకున్నారు. స్థానిక నవాబుపేటలోని శ్రీ మల్లేశ్వరస్వామి దేవాలయం నుంచి స్వామివార్లను పల్లకిలో ఊరేగిస్తూ కాలువ ఘాట్ వద్ద ఉన్న కల్యాణమండపంలో కొలువుదీర్చారు. అనంతరం స్వామివార్లను శోభాయమానంగా అలంకరించి కాలువ ఘాట్‌లో తెప్పోత్సవం నిర్వహించారు. సంప్రదాయబద్ధంగా కనుమ పారువేట ఉత్సవాన్ని కనులపండువగా చేశారు. ప్రతిఏడాది తెప్పోత్సవానికి తరలివచ్చే వివిధ దేవతామూర్తుల ఉత్సవ విగ్రహాలు ఈ ఏడాది కోవిడ్ కారణంగా నిలుపుదల చేయడంతో ఈ ఉత్సవ వేడుకల సంరంభం గతంలోకంటే కొంత తగ్గింది. అయితే భక్తులు మాత్రం పెద్దసంఖ్యలో తరలివచ్చారు. తెప్పోత్సవాన్ని నుడా ఛైర్మెన్ ముక్కాల ద్వారకానాథ్, స్థానిక నాయకుడు వెంకటేశ్వర్లురెడ్డి, ఆలయ ఇఓ నవీన్‌కుమార్‌లు ప్రారంభించారు. ఈ ఉత్సవ వేడుకతో చేసిన విద్యుద్దీపాలంకరణలతో మైపాడుగేట్ ప్రాంతమంతా దేదీప్యమానమైంది.

## ఆర్టీసీకి
# 45 లక్షల రాబడి

సంక్రాంతి పండుగ సందర్భంగా ఆర్టీసీ నెల్లూరు రీజియన్‌కు మంచి రాబడే వచ్చింది. ఈ కరోనా కష్టకాలంలో ఊహించని ఆదాయం వచ్చింది. పండుగ రోజుల్లో నెల్లూరు నుంచి వివిధ ప్రాంతాలకు నడిపిన ప్రత్యేక బస్సుల ద్వారా 45 లక్షల రూపాయల దాకా రాబడి వచ్చినట్లు ఆర్టీసి వర్గాలు పేర్కొన్నాయి. ఈనెల 8 నుంచి 14వ తేది వరకు నెల్లూరు నుంచి హైదరాబాద్, విశాఖపట్టణం, విజయనగరం, శ్రీకాకుళం, బెంగుళూరు, చెన్నైలకు 90 ప్రత్యేక బస్సులను ఆర్టీసి నడిపింది. పండుగ తర్వాత కూడా అదే మార్గాల్లో 40 బస్సులు నడిపారు. మొత్తం 130 బస్సులను వివిధ ప్రాంతాలకు నడపడం ద్వారా మంచి రాబడే వచ్చినట్లయింది.

## దివ్యమాంబ అమ్మవారికి
# బంగారు ఆభరణాలు

నెల్లూరులోని రత్నం విద్యాసంస్థల అధినేత కెవి రత్నం కుమారుడు డాక్టర్ కృష్ణకిశోర్-వాసంతి దంపతులు ఈనెల 16న ఆత్మకూరు రూరల్ పరిధిలోని బట్టేపాడు గ్రామంలో కొలువై ఉన్న దివ్యమాంబాదేవి అమ్మవారికి 1.09 లక్షల విలువైన ఆభరణాలు సమర్పించుకుని తమ భక్తిని చాటుకున్నారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని తమ అమ్మమ్మ స్వగ్రామమైన కొత్తపాళెంకు వచ్చిన సందర్భంగా వారు దివ్యమాంబా దేవి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేసి ఆభరణాలు సమర్పించారు.



## సంతోష సంరంభంగా..
# ద్వారకానాథ్ పుట్టినరోజు వేడుకలు

ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షులు, నెల్లూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (నుడా) ఛైర్మెన్ ముక్కాల ద్వారకానాథ్ పుట్టినరోజు వేడుకలు ఈనెల 16న ఆర్యవైశ్యులు, ఆయన సహచరులు సంతోష సంరంభంగా జరుపుకున్నారు. నెల్లూరులోని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో జరిగిన ఈ వేడుకలను స్థానిక ఉస్మాన్‌సాహెబ్‌పేట శివాలయం ఛైర్మెన్ మేడా కామేశ్వరరావు ఆధ్వర్యంలో ఎంతో ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం అర్బన్ అధ్యక్షుడు పేర్ల సీతారామారావు మాట్లాడుతూ ఆర్యవైశ్యుల అభివృద్ధికి ముక్కాల ఎంతగానో కృషిచేస్తున్నారని, ఆర్యవైశ్య ఆణిముత్యం ముక్కాల ద్వారకానాథ్ అంటూ కొనియాడారు. ద్వారక జన్మదినాన్ని పురస్కరించుకుని అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేయించి 108 టెంకాయలు కొట్టారు. ద్వారకకు అందరూ కలిసి పుట్టినరోజు శుభాకాంక్షలు చెప్పారు. అనంతరం గీతామయి బాలలభవన్‌లో చిన్నారులకు అన్నదానం చేసి వారికి విద్యాసామగ్రిని అందజేశారు. ఆర్యవైశ్య ప్రముఖులు పొదర్తి బాలాజీ, కోటా సూర్యనారాయణ, చలువాది శరణ్‌కుమార్, పబ్బిశెట్టి శ్రీనివాసులు, శేగు శేఖర్ తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా నవాబుపేటలోని ద్వారకానాథ్ కార్యాలయంలో 52 కిలోల భారీ కేకు కట్ చేసి అందరికీ పంచిపెట్టారు.

# అల్తూరు జ్ఞాపకార్థం.. చెడుగుడు పోటీలు



ప్రముఖ దాతలు, దైవభక్తి పరాయణులైన స్వర్గీయ అల్తూరి ఆదినారాయణరెడ్డి, సురేంద్రరెడ్డిల జ్ఞాపకార్థం వారి స్వగ్రామమైన తోటపల్లిగూడూరు మండలంలోని పాపిరెడ్డిపాళెంలో సంక్రాంతి సందర్భంగా జిల్లా స్థాయిలో చెడుగుడు పోటీలు నిర్వహించి విజేతలైన క్రీడాకారులకు బహుమతులిచ్చి ప్రోత్సహించారు. ఈనెల 14, 15 తేదీల్లో ప్రముఖ పారిశ్రామికవేత్త, శివభక్తుడు అల్తూరు గిరీష్‌రెడ్డి, ఆయన సోదరుడు మహేష్‌రెడ్డి కుటుంబీకుల ఆధ్వర్యంలో ఈ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో పురుషులు, మహిళల విభాగాల్లో మొత్తం 50 జట్లు పాల్గొనగా పురుషుల విభాగంలో ముదివర్తి, అల్లూరు, పాపిరెడ్డిపాళెం, రావూరు, కెకె పాళెం, గోగులపల్లి జట్లు విజేతలుగా నిలిచాయి. అదేవిధంగా మహిళల విభాగంలో పాపిరెడ్డిపాళెం, డికెడబ్ల్యు జట్టు, అల్లూరు, పొట్టేపాళెం, అనిత ఫ్రెండ్స్ జట్లు బహుమతులు సాధించాయి. పోటీల నిర్వాహకులు విజేతలకు నగదు బహుమతులందజేసి అభినందించారు. తిరువళ్ళూరు ఈశ్వరయ్య, ఎస్‌ఎస్‌ఎంఆర్ యూత్ అసోసియేషన్ దేవకుమార్, ఆర్‌కె మురళి, టి.వెంకటేశ్వర్లు, కె.రాము, బి.మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# తగ్గేదే లే..

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి పూర్తిగా దిగజారిందనే విశ్లేషణలు పుంఖానుపుంఖాలుగా వెలువడుతున్నాయి. ఖజానాకు పన్నుల రూపంలో వచ్చిన సొమ్ము వచ్చినట్టుగా సంక్షేమ పథకాలకు ప్రభుత్వం మళ్లిస్తోంది. దేవాదాయ శాఖతో సహా ఏ ప్రభుత్వ శాఖలో నాలుగు రూపాయల నిలువ ఉన్నా, సంక్షేమ పథకాలకు మళ్లిస్తున్నారు. అప్పులు చేయడానికి అనుమతుల కోసం రాష్ట్ర ఆర్థికశాఖ ఉన్నతాధికారులు, ఆర్థిక మంత్రి కూడా ఢిల్లీ-విజయవాడ మధ్య షటిల్ సర్వీస్ ప్రారంభించారు. వారి స్థాయి కూడా దాటినట్టు కనబడడంతో, చివరికి ముఖ్యమంత్రి జగన్ స్వయంగా వెళ్ళవలసి వచ్చింది. ఈ పరిస్థితులలో, ఉద్యోగులకు జీతాలు కూడా ఒకటవ తేదీన చెల్లించలేని పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ సమయంలోనే పీఆర్సీ నివేదిక బహిర్గతం చేయాలని, దాని ప్రకారం జీతభత్యాలు ఇవ్వాలని ఉద్యోగ సంఘాలు ప్రభుత్వంపై ఒత్తిడి తేవడం ప్రారంభించాయి.

ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డితోను, ప్రధాన కార్యదర్శి సమీర్‌శర్మతోను ఉద్యోగ సంఘాల నేతలు సమావేశాలు ప్రారంభించారు. కానీ, ఉద్యోగుల డిమాండ్స్ ఆమోదించగల స్థితిలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి లేదన్నది ప్రభుత్వ వాదన. సంక్షేమ పథకాలే ప్రభుత్వానికి తొలి ప్రాధాన్యం కావడంతో ఉద్యోగుల డిమాండ్స్ విషయంలో ఏం చేయాలనే తర్జన భర్జనలు ప్రభుత్వంలో మొదలయ్యాయి.


ప్రభుత్వంలోనూ ఉద్యోగ నేతల లోనూ 'కాక' మొదలైంది. ఈ పీఆర్సీ వ్యవహారం చివరకు ముఖ్యమంత్రి జగన్ సమక్షానికి చేరింది. ముఖ్యమంత్రి వద్దకు వెళ్ళే సమయానికే తక్కువ పీఆర్సీ సిఫారసులకు ఉద్యోగ సంఘాల నేతలను మానసికంగా సిద్ధం చేశారు. ముఖ్యమంత్రి కూడా రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు ఎంత క్లిష్టంగా తయారయ్యాయో విపులీకరించి 23 శాతం పీఆర్సీని ప్రకటించారు. దాంతో పాటు, ఇంటి అద్దె అలవెన్సు, ఇతర ఆర్థిక ప్రయోజనాల విషయం అధికారులు చూస్తారని అంటూ ఉద్యోగుల పదవీ విరమణ వయసును 60 నుంచి 62 సంవత్సరాలకు పెంచుతున్నట్టు ప్రకటించారు. ఉద్యోగ నేతలు హర్షధ్వానాలు చేశారు.

అయితే, ఇంటి అద్దె అలవెన్సు, సిసిఏ, పింఛను ప్రయోజనాల్లో సగానికి సగం కోత పడుతూ జీఓలు రావడంతో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఒక్కసారిగా దిగ్భ్రమకు లోనయ్యారు. తమ,తమ సంఘాల నేతల'నిర్వాకం'పై విరుచుకుపడడం మొదలుపెట్టారు. దాంతో, ఉద్యోగుల వద్ద మొహం చెల్లని సంఘాల నేతలు గత ప్రభుత్వం మంజూరు చేసిన ఇతర ఆర్థిక ప్రయోజనాలను యథాతథంగా అమలు చేస్తూ జీఓలు ఇవ్వాలని ఇప్పుడు డిమాండ్ చేస్తున్నారు. దాంతో, ప్రభుత్వానికి ఉద్యోగ సంఘాలకు మధ్య పీటముడి పడిపోయినట్టయింది. ఉద్యోగులు తీవ్ర అసహనానికి లోను కావడంతో వారి సంఘాల నేతలు ఇప్పుడు సమ్మె నోటీస్ ఇవ్వబోతున్నారు. ముఖ్యమంత్రి జగన్‌కు ఇప్పటికే ఉన్న పలు సమస్యలకు తోడు.. ఇది ఒక అదనపు సవాల్‌గానే భావించవచ్చు.

కొత్తగా ఇవ్వకపోయినా, గత ప్రభుత్వంలో సాధించుకున్న ఆర్థిక ప్రయోజనాలను యథాతథంగా ఇవ్వాలనేది ఉద్యోగుల డిమాండు. 'కుదరదు...'అనేది ప్రభుత్వ వాదన. తగ్గేదే లే అన్నట్టుగా ఇద్దరూ వ్యవహరిస్తున్నారు.

ఈ వివాదం ముదిరి పాకానపడితే వైసీపీకి నష్టం అనే వాదనలు కూడా వినబడుతున్నాయి. వచ్చే ఎన్నికల నిర్వహణపై ఉద్యోగుల సమ్మె ప్రభావం ఉంటుందనే భావనలు వ్యక్తం అవుతున్నాయి. ప్రస్తుత పరిస్థితి ఉద్యోగ సంఘాల నేతల చేతుల్లో లేదు. లక్షలాది మంది ఉద్యోగుల చేతుల్లోకి వెళ్ళిపోయింది. అందువల్ల ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా నేతలు చప్పట్లు కొట్టే పరిస్థితి లేదు. ప్రభుత్వం దీనిని, తన ప్రతిష్టకు సంబంధించిన అంశంగా పరిగణించే అవకాశాలే ఎక్కువ అని ప్రభుత్వ వ్యవహార శైలి చూస్తున్నవారు అంటున్నారు. ఈ పరిస్థితుల్లో ఈ వివాదం ఎటుదిరిగి ఎలా పరిష్కారం అవుతుందో చూడాలి. ప్రభుత్వం తగ్గితే జగన్ ఓడినట్లే. అలాగని ఉద్యోగులు తగ్గితే వ్యవస్థ ఓడినట్లే...! ఇద్దరికీ ఆమోదయోగ్యమైన పరిష్కారాన్ని ఏ దేవుడో సూచించాలి.

## ఆంధ్రప్రదేశ్ ప్రశాసకుడు, అధికార ట్రస్టీగా..
# పొనకా జనార్ధన్‌రెడ్డికి అరుదైన గౌరవం



నెల్లూరుజిల్లా బుచ్చిరెడ్డిపాళెం మండలం మినగల్లు వాసి పొనకా జనార్ధన్‌రెడ్డికి అరుదైన గౌరవం దక్కింది. ఏపి ప్రభుత్వ ప్రశాసకుడు, అధికార ట్రస్టీగా ప్రభుత్వం ఇటీవల ఆయన్ను నియమించింది. రాష్ట్రం విడిపోయిన ఏడేళ్ల తర్వాత ఆ పదవిని ప్రభుత్వం భర్తీ చేసింది. అంటే, కొత్త ఏపీ ప్రభుత్వానికి తొలి అధికార ట్రస్టీ మన నెల్లూరీయుడు కావడం విశేషం. హైకోర్టు న్యాయవాదిగా సుమారు 15 సంవత్సరాలకుపైగానే ఆయన విశిష్టసేవలందించారు. భారత రాజ్యాంగం, క్రిమినల్, సివిల్ చట్టాలపై విశేష పరిజ్ఞానం ఉన్న పొనకా జనార్ధన్‌రెడ్డికి జిల్లా జడ్జి, సివిల్‌కోర్టు హోదా కలిగిన ఈ ప్రతిష్టాత్మక పదవి లభించడం హర్షదాయకం. దీంతో ఏపి హైకోర్టు అమరావతి పరిధిలో తాను పనిచేయనున్నట్లు ఆయన తెలిపారు.

పొనకా జనార్ధన్‌రెడ్డి మినగల్లులో 10వ తరగతి వరకు చదివారు. ఆ తర్వాత నెల్లూరు సర్వోదయ, విఆర్ కళాశాలల్లో ఇంటర్, డిగ్రీ, లా విద్యను పూర్తిచేశారు. విద్యార్థిదశ నుంచే వివిధ సామాజిక ఉద్యమాల్లో చురుకుగా పాల్గొన్నారు. నేత్రదాతల సంస్థల్లో ఉంటూ ఇప్పటిదాకా 28సార్లు రక్తదానం కూడా చేశారు. సమాజం పట్ల, భారత రాజ్యాంగం పట్ల సరైన అవగాహన కలిగివున్న జనార్ధన్‌రెడ్డికి ఈ సమున్నతమైన పదవి లభించడం పట్ల ఆయన సహచరులు, నెల్లూరీయులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

## 'ప్రభా'తం

# కలచివేస్తున్న.. బలవన్మరణాలు

**నానాటికీ దేశంలో బలవన్మరణాలు పెరిగిపోతున్నాయి. చిన్న విషయాలకే క్షణికావేశానికి లోనై ఎంతోమంది ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. మరోవైపు కరోనా దెబ్బతో ఆర్థిక అసమానతలతో పేదలు నిరుపేదలుగా మారిపోతున్నారు. కోట్లాదిమంది పేదలు ఉపాధిని కోల్పోతున్నారు. దీంతో అనేకమంది దుర్భర జీవితాలను సాగించలేక ఆత్మహత్యల దారి వెతుక్కుంటున్నారు. ఇకనైనా ప్రభుత్వాలు ఆర్థిక అసమానతలను తొలగించేందుకు పథకాలు సిద్ధం చేయాలి. ప్రజల్లో జీవనభద్రతకు, జీవిత రక్షణకు భరోసా కల్పించాలి. ప్రభుత్వాలతో పాటు స్వచ్ఛంధ సంస్థలు, మానవీయమూర్తులందరూ కలిసి ప్రజల్లో జీవితం పట్ల సరైన అవగాహన కలిగించేందుకు కూడా కృషి చేయాలి.**

నాన్న తిట్టాడని ఒకరు, భర్త కొట్టాడని మరొకరు, భార్య అలిగిందని ఇంకొకరు.. ఇలా అనేక రకాల కారణాలతో ఎంతోమంది బలవంతంగా ఆత్మహత్యలకు పాల్పడుతుండడం బాధాకరం. ప్రతినిత్యం పత్రికల్లో, ప్రసార సాధనాల్లో ఇలాంటి దయనీయ కథనాలు చూస్తూనే ఉన్నాం. దేశంలో రానురాను ఇలాంటి బలవన్మరణాలు పెరిగిపోతుండడం సమాజాన్ని కలవరపెడుతోంది. చిన్నచిన్న విషయాలకే కలతచెంది ఆత్మహత్యల దారి వెతుక్కుంటున్న అభాగ్యులను చూసి సాటి ప్రజలు ఎంతో ఆవేదన చెందుతున్నారు. వారి మరణాలతో ఆ కుటుంబాలు పడే వేదన కూడా అంతా ఇంతా కాదు. మరోవైపు పేదరికం, ఆర్థిక అసమానతలు పెరిగిపోతుండడంతో ఆత్మహత్యలు కూడా పెరిగిపోతూనే ఉండడం గమనార్హం. అసలే కరోనా మహమ్మారి వ్యాధి ప్రజల్ని పట్టిపీడిస్తూ లక్షలాదిమందిని పొట్టనపెట్టుకుంటున్న ఈ రాకాసికాలంలో అన్ని రంగాలు అణగారిపోయాయి. అభివృద్ధి మసకబారిపోతోంది. కోట్లాది మంది పేదలు ఉపాధి లేక అల్లాడిపోతున్నారు. కేవలం ఈ కరోనా వల్లనే ప్రపంచంలో ఆర్థిక అసమానతలు భయంకరంగా పెరిగిపోతున్నాయని, పేదలు నిరుపేదలుగా మారిపోతున్నారని, ఈ రెండేళ్ళలోనే 16 కోట్లమందికి పైగా ప్రజలు దుర్భర దారిద్ర్యంలో కూరుకుపోయారని ఆక్స్‌ఫామ్ అనే సంస్థ తన తాజా నివేదికలో పేర్కొంది. మనదేశంలోనూ కరోనా ధాటికి లక్షలాది మంది పేదలు ఉపాధి కోల్పోయారు. ఈ కష్టాలతో ఇక జీవితాలు సాగించ లేమని విరక్తితో ఎంతోమంది నిర్భాగ్యులు ఆత్మహత్యలు చేసుకుంటుండడం కూడా జరుగుతోంది. దీంతో దేశంలో ఆత్మహత్యల సంఖ్య ఇటీవలి కాలంలో గణనీయంగా పెరిగిపోతోంది. ఇలాంటి దురదృష్టకర వాతావరణం ప్రతిఒక్కరికీ ఆందోళన కలిగిస్తోంది. నేటికీ ఇంకా ఎంతోమంది కార్మికులు, కర్షకులు, నిరుద్యోగులు అప్పులతో, పస్తులతో కుటుంబాలను పోషించుకోలేక నిత్యం నరకయాతన పడుతున్నారు. కరోనా మహమ్మారి వ్యాధి కారణంగా జరుగుతున్న ఆత్మహత్యలతో పాటు సమాజంలో ఇతరత్రా వేధింపులతో అనేకమంది మహిళలు నిత్యం ఎక్కడో ఒకచోట బలవన్మరణాలకు పాల్పడుతూనే ఉండడం విచారకరం!..పురుషులకు తోడునీడగా, సమాజానికి వెలుగుగా ఉంటూ కుటుంబాలను కంటికి రెప్పలా కాపాడుకునే మహిళలు, గృహిణులు అధికశాతం ఆత్మహత్యలకు పాల్పడుతుండడం మరెంతో బాధాకరం. ప్రపంచంలో జరుగుతున్న మహిళల ఆత్మహత్యల్లో దాదాపు 40 శాతం దాకా మనదేశంలోనే జరుగుతున్నాయని గణాంకాలు చెప్తున్నాయి. వరకట్న వేధింపులు, భర్తల హింసలు, గృహహింసలు, ప్రేమ పేరుతో జరిగే మోసాలు, పేదరికం, అమాయకత్వం, అజ్ఞానం.. ఇలా ఎన్నో కారణాలు మహిళామణుల అకాల మరణాలకు దారితీస్తున్నాయి. లోపభూయిష్టమైన విద్యావిధానాల వల్ల, ర్యాంకుల సాధనే జీవితపరమార్థంగా భావిస్తున్న నేటి కాలంలో మార్కులు సరిగా రాలేదని కూడా అనేకమంది విద్యార్థిని విద్యార్థులు తీవ్ర నిరాశకు గురై చివరికి జీవితాల మీదనే విరక్తి పెంచుకుంటున్నారు. అయినా, జీవితమన్నాక ఎన్నో కష్టనష్టాలు, బాదరబందీలు ఉండడం సహజం. కుటుంబాల్లో కలతలు సర్వసాధారణం. కష్టాలు వస్తుంటాయి పోతుంటాయి. ప్రపంచంలో మనకే కాదు..ప్రతి ఒక్క మనిషికీ బాధలు ఉండనే ఉంటాయి. ఎవరికి తగ్గ కష్టాలు వారికి వెన్నంటే ఉంటాయి. అట్లని విరక్తి చెందితే ఎలా?..ఎప్పుడూ చీకటే ఉండదు. పగలూ ఉంటుంది. రాత్రయినా వెన్నెల తోడుంటుంది. కోట్లాదిమంది ప్రజలు తమ సమస్యలను తామే ధైర్యంగా పరిష్కరించుకుంటూ తమకు, తమ కుటుంబాలకు అండగా ఉంటూ ఆదర్శవంతంగా జీవితాలు గడుపుతున్నారు. అలాంటివారిని చూసి స్ఫూర్తిని పొందాలి. అయితే కొందరు మాత్రం లేనిపోని నిర్వేదంతో జీవితాలపై విరక్తి చెందుతుండడమే విచారకరం! ఏ సమస్యకి కూడా ఆత్మహత్య మాత్రం పరిష్కారం కాదు. జీవితం జీవించడానికే కానీ మరణించడానికి కాదు. ప్రతి చిన్న విషయాన్నీ పెద్దదిగా చేసుకుని.. అదేపనిగా ఆలోచించి మానసిక వత్తిడికి, లేదా కుంగుబాటుకు గురై నిరాశా నిస్పృహలకు గురికావడం, ఇక ఈ జీవితమే వద్దనే విరక్తి భావనలకు లోనుకావడం మంచిది కాదు. సమస్యలు ఎన్నున్నా ధైర్యంగా ఆత్మవిశ్వాసంతో ఎదుర్కొని జీవితంలో విజయవంతంగా రాణించడమే ఏ మనిషికైనా తక్షణ కర్తవ్యం. ఎవరికి వారు విజ్ఞతతో తమ జీవితాలను తీర్చిదిద్దుకోవాలి. అంతేకానీ, క్షణికావేశంతో జీవితాలను అంతం చేసుకోకూడదు. ఈ సృష్టిలో, సకల జీవకోటిలో వివేకంతో ఆలోచించగలిగేది మనిషి మాత్రమే. అందుకు తోడుగా తల్లి గర్భంలో ఉన్నప్పటి నుంచి, పుట్టి పెద్దయ్యాక కూడా బిడ్డల్ని సంరక్షించే తల్లిదండ్రులు, చేయిపట్టుకు నడిపించే పెద్దలు, కుటుంబంతో పాటు చుట్టూ ఉన్న సమాజం, ప్రభుత్వాలు మనకెంతో రక్షగా ఉంటున్నాయి. పసితనం నుంచి విద్యాబుద్ధులు నేర్పే గురువులు, మన శ్రేయస్సును కోరుకునే హితులు, స్నేహితులు ఎందరో ఉంటారని, ఎంతటి జటిలమైన సమస్య వచ్చినా పరిష్కారానికి దారిచూపేవారు బోలెడంతమంది ఉంటారు కనుక ధైర్యంగా జీవితాలు కొనసాగించాలి. ప్రభుత్వాలు కూడా ఈ విషయాలను దృష్టిలో పెట్టుకుని నానాటికీ పెరిగిపోతున్న ఈ బలవన్మరణాలను నివారించేందుకు, వారిలో జీవితం పట్ల ఆశలు చిగురించేందుకు సరికొత్త ప్రణాళికలతో ముందుకు రావాలి. ముఖ్యంగా ఆర్థిక అసమానతలను తొలగించేందుకు పథకాలు సిద్ధం చేయాలి. ప్రజల జీవనభద్రతకు, జీవితాల రక్షణకు భరోసా కల్పించాలి. ప్రభుత్వాలతో పాటు స్వచ్ఛంధ సంస్థలు, ఇతరత్రా రంగాల్లోని మానవీయమూర్తులందరూ కలిసి ప్రజల్లో జీవితం పట్ల సరైన అవగాహన కలిగించేందుకు కూడా నిరంతరం కృషి చేయాలి.

# జగనన్న గృహ హక్కు .. పేదలకు వరం

### జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు



జగనన్న సంపూర్ణ గృహ హక్కు పథకం అమలు తీరును అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ చక్రధర్‌బాబు

జగనన్న సంపూర్ణ గృహ హక్కు పథకం పేదలకు వరం లాంటిదని, జిల్లాలో అర్హులైన ప్రతి ఒక్కరికి ఈ పథకం వర్తించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కె.వి.ఎన్. చక్రధర్‌బాబు అధికారులను ఆదేశించారు. ఈనెల 17న అల్లూరు మున్సిపల్ పరిధిలోని నార్త్ మోపూరులో గ్రామ సచివాలయాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించి, సచివాలయ పరిధిలో సంపూర్ణ గృహహక్కు పథకం అమలు పురోగతిని పరిశీలించారు. జగనన్న సంపూర్ణ గృహ పథకం పేద ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన చక్కటి అవకాశమన్నారు. గ్రామ వాలంటీర్లు గ్రామ సచివాలయ సిబ్బంది అర్హులందరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ పథకం అమలులో క్షేత్రస్థాయిలో ఏవైనా సమస్యలు వుంటే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. అనంతరం కావలి శాసనసభ్యులు రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డితో కలిసి అల్లూరులోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి అక్కడ జరుగుతున్న వ్యాక్సినేషన్ ప్రక్రియ, వైద్య సేవల గురించి డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. సామాజిక ఆరోగ్య కేంద్రంలో చేపట్టాల్సిన పనులు, డాక్టర్స్, మెడికల్ సిబ్బంది కొరత గురించి ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కలెక్టర్‌కు వివరించారు. కావలి ఆర్డీఓ శీనా నాయక్, అల్లూరు మున్సిపల్ కమిషనర్ శివారెడ్డి, ఎం.పి.డి.ఓ నగేశ్‌కుమారి, తహశీల్దార్ సి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## పేదల వైద్యానికి ప్రథమ ప్రాధాన్యత :

పేదలకు వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నదని, అందుకు ప్రజలు కూడా సామాజిక బాధ్యతతో ముందుకు రావడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ కె.వి.ఎన్. చక్రధర్‌బాబు పేర్కొన్నారు. ఈనెల 18న ఆయన ఆత్మకూరులోని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి ఆసుపత్రిలో అందిస్తున్న వైద్య సేవల గురించి డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బంగే ఇండియా ప్రవేట్ లిమిటెడ్ యాజమాన్యం వారు విరాళంగా అందజేసిన 4 లక్షల 10 వేల రూపాయల విలువైన రెండు డెడ్ బాడీ ఫ్రీజర్స్ ను కలెక్టర్ ఆత్మకూరు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి అందచేశారు. సామాజిక బాధ్యతతో ఆ సంస్థ యాజమాన్యం వారు ముందుకు వచ్చి ప్రభుత్వ ఆసుపత్రుల్లో అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా రెండు డెడ్ బాడీ ఫ్రీజర్స్‌ను డొనేట్ చేయడం అభినందనీయమని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ హరేందిరప్రసాద్, ఆత్మకూరు ఆర్డీఓ చైత్రవర్షిణి, ఎంపిపి వేణుగోపాల్‌రెడ్డి, ఆ సంస్థ ప్లాంట్ మేనేజర్ భాస్కర్ జయరామన్, హెచ్.ఆర్ మేనేజర్ దక్షిణామూర్తి తదితరులు పాల్గొన్నారు.

# అన్నదాతలకు అన్నీ కష్టాలే

ఈ-మెయిల్ ప్రజావాణి
lawyerpatrika@gmail.com
+91 98663 14741

జిల్లాలో రైతులకు అన్నీ కష్టాలే ఎదురవుతున్నాయి. పంటలు వేసుకునే దగ్గరనుంచి అవి పండి ఇంటికి వచ్చేదాకా నమ్మకం లేని పరిస్థితి ఏర్పడింది. ఈ రబీ సీజన్‌లో వేసుకున్న పంటలు ఇంకొద్ది రోజులకు చేతికి అందివస్తాయని అనుకుంటున్న దశలోనే అకాల వర్షాలు వచ్చి పడ్డాయి. జిల్లాలోని అనేక ప్రాంతాల్లో ఒకటే వాన. కోతకు వచ్చిన చెరకు, పూతకు వచ్చిన వేరుశనగ అంతా సర్వనాశనం అయిపోయింది. కూరగాయల తోటలకు, ఆకు కూరలు వేసుకున్న రైతులకు కూడా నష్టాలు తప్పేటట్టు కనిపించడం లేదు. ఈ వర్షాలతో తోటలకు తెగుళ్ళు వస్తున్నాయి. పోయినసారి ఖరీఫ్ సీజన్‌లోనూ ఇదే దుస్థితి. భారీ వర్షాలతో పంటలన్నీ దెబ్బతిన్నాయి. ఇప్పుడేమో అకాల వర్షాలు. రైతుల బాధలు ఎన్నని చెప్పగలం?..ప్రభుత్వం కనికరించి దెబ్బతిన్న పంటపొలాలను పరిశీలించి తగు సాయం అందించాలి. లేకుంటే వేసుకున్న పంటలు నష్టపోయి, అన్నదాతల కుటుంబాలు అన్నానికే ఇబ్బందిపడే పరిస్థితులు వస్తాయి. **- ఎం.మల్లికార్జునయ్య, గూడూరు.**

# కోట రోడ్లు.. గబ్బు గబ్బు!

చిన్న వానొస్తే చాలు మండల కేంద్రమైన కోటలో రోడ్లు బురదగుంటలుగా మారిపోతున్నాయి. అడుగు తీసి అడుగు పెట్టలేని పరిస్థితి. ఆర్టీసీ బస్టాండ్, గాంధీబొమ్మ సెంటర్ ఇలా ఎక్కడచూసినా దుర్గంధమే. ఆ రొచ్చులో నడవలేక ప్రజలు పడే బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయి. ఇళ్ళ ముందు మురుగునీళ్ళు మడుగులు కడుతున్నాయి. అవి వెళ్ళే దారి లేక ఎండిపోయే దాకా అక్కడే నిలవడం వల్ల దోమలు ప్రబలిపోతున్నాయి. వానొచ్చినప్పుడు రోడ్లన్నీ కాలువల్లాగా తయారైపోతుంటాయి. మోకాటిలోతు నీళ్ళు వీధుల్లో ప్రవహిస్తుంటాయి. అధికారులు ఈ దుస్థితిని పట్టించుకోవడం లేదు. పంట కాలువలు ఆక్రమణల పాలైపోవడంతో డ్రైనేజీ పరిస్థితి పరమ అధ్వాన్నంగా ఉంది. గ్రామాలు, మండలాల్లో పారిశుద్ధ్యం పరిరక్షణకు చర్యలు తీసుకుంటున్నామని అధికారులు పేపర్లలో చెప్పుకుంటున్నారే తప్ప వాస్తవ పరిస్థితుల్లో ఏ గ్రామం చూసినా దయనీయంగానే ఉంది. ఎక్కడి చెత్త అక్కడే ఉంటోంది. పట్టించుకునేవారు లేరు. చుట్టుపక్కల గ్రామాల నుంచి నిత్యం పనులపై మండల కేంద్రమైన కోటకు వస్తుంటారు. ఇక్కడ పరిస్థితి చూసి ముక్కులు మూసుకుంటుంటారు. ఇకనైనా మండల అధికారులు కోట రోడ్లపై దృష్టిపెట్టాలి. డ్రైనేజీ వ్యవస్థను బాగుచేయించాలి. రోడ్లపై ఉన్న గుంతలను పూడ్పించి, సైడు కాలువలని శుభ్రం చేయించాలని ప్రార్థన. **- కె. రామరాఘవరావు, కోట.**

### 'గతిశక్తి' పథకం ద్వారా..

# పారిశ్రామిక కారిడార్ల పనులు

### - శ్రీసిటీ ఎం.డి రవీంద్ర సన్నారెడ్డి సూచన






కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'గతి శక్తి' పథకం ద్వారా పారిశ్రామిక కారిడార్ల పనులను త్వరితగతిన పూర్తిచేయాలని శ్రీసిటీ ఎం.డి రవీంద్ర సన్నారెడ్డి సూచించారు. ఈ పథకం అమలుపై వర్చువల్ మోడ్‌లో ఈనెల 17న జరిగిన చర్చల్లో ప్యానెల్ సభ్యులలో ఒకరైన రవీంద్ర సన్నారెడ్డి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా శ్రీసిటీ కేంద్రంగా చెన్నై-తిరుపతి-నెల్లూరు ట్రై-సిటీ గ్రోత్ కారిడార్‌కు ఉన్న అవకాశాలను ఆయన వివరించారు. ఇతర దేశాల నుండి పెట్టుబడులను ఆకర్షించే ప్రాధాన్యత వున్న దేశంలోని 10 ప్రముఖ తయారీకేంద్రాలలో శ్రీసిటీ ఒకటిగా ఉదన్నారు. ట్రై-సిటీ హబ్ మధ్యలో రెండు ప్రధాన పారిశ్రామిక కారిడార్లు చెన్నై-బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్ మరియు విశాఖపట్నం-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్‌లు ఉన్నాయని, వీటి మధ్యలో ఉన్న శ్రీసిటీ, 28 దేశాలకు చెందిన దాదాపు 200 ప్రతిష్టాత్మక బ్రాండ్‌ల స్థాపనతో దక్షిణ భారతదేశంలోనే అతిపెద్ద పారిశ్రామిక పార్కుగా అవతరించిందని పేర్కొన్నారు. భారత మార్కెట్‌లలో విజయవంతం కావడానికి దేశ విదేశీ కంపెనీలకు ఈ ప్రాంతం అనువైన వ్యాపార ప్రదేశమని, పరిశ్రమలకు అనుకూలమైన ప్రాంతమని, అద్భుతమైన రోడ్డు, రైలు కనెక్టివిటీ, నాలుగు ఓడరేవులు, రెండు అంతర్జాతీయ విమానాశ్రయాలను కలిగివున్న ట్రై-సిటీ హబ్ దేశ విదేశీ మార్కెట్‌కు సేవలందించే ప్రయోజనాన్ని అందిస్తుందని తెలిపారు. ఇంకా అధిక నైపుణ్యం కలిగిన శ్రామికశక్తి మరియు కార్మికుల ఖర్చులో సౌలభ్యం ఉంటుందన్నారు. ప్రస్తుతం ఉన్న మౌలిక సదుపాయాలను పటిష్టం చేయడంతోపాటు జాతీయ రహదారి విస్తరణ-16లో పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆయన ఈ సందర్భంగా అధికారుల దృష్టికి తెచ్చారు. చెన్నై నుండి తడ మధ్య 6 లైన్ల ప్రాజెక్టును వేగవంతం చేయడం, అన్ని ఫ్లై ఓవర్ల పనులను పూర్తి చేయడం, తడ రైల్‌హెడ్‌ను జాతీయ కనెక్టివిటీతో కంటైనర్ జోన్‌గా అప్‌గ్రేడ్ చేయడం, చెన్నై మరియు నెల్లూరు మధ్య ప్యాసింజర్ రైలు, స్థానిక కనెక్టివిటీని మెరుగుపరచడం, చెన్నై, ఎన్నూర్ మరియు కృష్ణపట్నంలలో పోర్ట్ సామర్థ్యం కంటైనర్ నిర్వహణ సామర్థ్యాలను మెరుగుపరచడం, శ్రీసిటీ సమీపంలోని క్లస్టర్ల కోసం సహజ వాయువు పైప్‌లైన్ గ్రీన్ తయారీని ప్రారంభించడం, గ్రీన్ పవర్ కొనుగోలు మరియు పారిశ్రామిక యూనిట్ల కోసం క్యాప్టివ్ కెపాసిటీలను ఎనేబుల్ చేయడం కోసం సమన్వయం, అనుమతులు, పారిశ్రామిక క్లస్టర్లకు జాతీయ రహదారి చివరి మైలు కనెక్టివిటీని మెరుగుపరచడం, టెలికాం ఆపరేటర్లకు మూలధన ప్రోత్సాహకం ద్వారా పారిశ్రామిక సమూహాలు మొదలైన కొన్ని ప్రధాన పెండింగ్ పనులను ఆయన వివరించారు.

కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ నిర్వహించిన 'పిఎం గతిశక్తి సదరన్ జోన్'పై దక్షిణ భారతదేశంలోని రాష్ట్ర మంత్రుల వర్చువల్ కాన్ఫరెన్స్ ప్రాథమిక సెషన్ తర్వాత ఈ ప్యానెల్ చర్చ జరిగింది. ప్రతినిధులను ఉద్దేశించి కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ మాట్లాడుతూ, 2025 నాటికి 5 ట్రిలియన్‌ల లక్ష్యం సాధించడానికి ప్రతిష్టాత్మక ప్రధాన మంత్రి గతిశక్తి జాతీయ మిషన్ ప్రణాళికను వేగంగా అమలుచేయడానికి రాష్ట్ర ప్రభుత్వాలు కేంద్రంతో సహకరించడం, సమన్వయం చేయడం, సమాచారం ఇవ్వడం ఎంతో అవసరమని సూచించారు.

## శ్రీసిటీలో ఉత్సాహంగా సంక్రాంతి ముగ్గుల పోటీలు



సంక్రాంతి పండుగ సందర్భంగా ఈ నెల 14న శ్రీసిటీలో వేడుకగా ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. శ్రీసిటీ బిజినెస్ సెంటర్ వద్ద ఎంతో ఉత్సాహంగా జరిగిన ఈ పోటీల్లో శ్రీసిటీలోని వివిధ విభాగాలకు చెందిన మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, వైస్ ప్రెసిడెంట్ రమేష్‌కుమార్ పర్యవేక్షణలో ఈ పోటీలు జరిగాయి. శ్రీసిటీలోని ఎన్సేన్ ఇంజనీరింగ్ మేనేజింగ్ డైరెక్టర్ శిల్ప, చెన్నైకి చెందిన ప్రముఖ ఆర్కిటెక్ట్‌లు ఆస్కార్ కొనుయుసో, పాన్నీ ఆస్కార్‌లు ఈ పోటీలకు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించడం విశేషం. తెలుగు ప్రజలంతా ఎంతో సంతోషంగా జరుపుకునే పెద్దపండుగ సందర్భంగా శ్రీసిటీలో ప్రతిఏటా ఇలా ముగ్గులపోటీలు నిర్వహించడం తమకెంతో ఆనందంగా ఉందంటూ శ్రీసిటీ ఎం.డి రవీంద్ర సన్నారెడ్డి అందరికీ సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందుకున్న విజేతలను అందరూ అభినందించారు.




### కరోనా కష్టకాలంలో..

# ప్రజలకు విపిఆర్ ప్రాణవాయువు

## కోటీ 30 లక్షల విలువచేసే 100 ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్ల వితరణ

*విపిఆర్ అంటే వితరణకు మారు పేరు. విపిఆర్ అంటే మానవీయతకు మరోపేరు.. అన్నది అందరికీ తెలిసిందే. ఎక్కడ కష్టం ఉంటే అక్కడ విపిఆర్ ఉంటారు. ప్రజల కష్టాల్లో పాలుపంచుకునేందుకు నేనున్నానంటూ ముందుకు వస్తారు. ఆయన ఎక్కడున్నా సరే.. జిల్లాలో ప్రజల కష్టనష్టాల మీదనే అధికంగా దృష్టిసారిస్తారు. వారి కష్టాలు తీరేందుకు తనవంతు సహకారం అందిస్తారు. అది ఆయన సుగుణం. జిల్లాకి అదే గొప్ప వరం.*

రాజ్యసభ సభ్యుడు, సేవాభూషణుడు విపిఆర్ (వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి) జిల్లాలో ప్రజల కోసం, పేదల కోసం చేస్తున్న అమూల్యమైన సేవలు అందరికీ తెలిసినవే. ఇప్పటికే వారి సేవలకు లెక్కే లేదు. వారి దాతృత్వానికి అంతే లేదు. జిల్లాలో ఎంతో మంది పేదలకు ఆయన తన చేయూతనిచ్చారు. విపిఆర్ ట్రస్ట్‌ను నెలకొల్పి కోట్లాది రూపాయలు ఖర్చుచేస్తూ ప్రజలకు అవసరమైన అనేక సదుపాయాల కల్పనకు ఎంతోకాలంగా అనితరసాధ్యమైన కృషి చేస్తున్నారు. విపిఆర్ విద్య, విపిఆర్ వైద్యం, విపిఆర్ అమృతధార ఇలా ఎన్నో పేర్లతో



కార్యక్రమంలో పాల్గొన్న వివిధ కార్పొరేషన్ల చైర్మెన్లు



మాట్లాడుతున్న మంత్రి అనిల్

ఆయన సేవలు నిరంతరాయంగా కొనసాగుతూనే ఉన్నాయి. దీనులకు, దివ్యాంగులకు కోట్లాది రూపాయల విరాళాలిచ్చి వారి భవితకు వెలుగుబాటలు వేసిన మహాదాత ఆయన. పేద విద్యార్థులకు విద్యను, పేదప్రజలకు వైద్యాన్ని, గ్రామీణ ప్రాంతాల్లో మంచినీటికి కటకటలాడుతున్న ప్రజలకు పరిశుభ్రమైన నీటిని అందించేందుకు ఇప్పటికే కోట్లాది రూపాయలు వ్యయం చేసి విపిఆర్ తన ఔదార్యాన్ని చాటుకున్నారు. సేవాభావంతో, ప్రజల మీద మమకారంతో ఆయన చేసిన, చేస్తున్న సేవలు జిల్లాకే గర్వకారణం.

జిల్లాలో ప్రజలకు ఎప్పుడు ఏ కష్టం వచ్చినా ఆదుకునేందుకు తానున్నానంటూ ముందుకువచ్చే విపిఆర్ ఇటీవలే జిల్లాలో వరదలకు గురై ఎంతోమంది నిరాశ్రయులైనప్పుడు వరదబాధితుల సహాయార్థం 50 లక్షల భారీ విరాళాన్ని అందజేసి తన వదాన్యతను చాటుకున్నారు. ఇప్పుడు కరోనా థర్డ్‌వేవ్ ముంచుకొస్తున్న తరుణంలో ఆ ముప్పును ఎదుర్కొనేందుకు అత్యంత అవసరమైన ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్లను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం ఎంతో అభినందనీయం. దాదాపు కోటీ 30 లక్షల రూపాయల భారీ వ్యయంతో వాటిని ఉచితంగా అందజేసి విపిఆర్ తన మానవీయతను చాటుకున్నారు.

నెల్లూరులోని విపిఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో ఈనెల 17న ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డితో పాటు ఆయన సతీమణి, విపిఆర్ ఫౌండేషన్ ఛైర్‌పర్సన్ వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటుచేసిన వైయస్సార్ హెల్త్ క్లినిక్‌లకు రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా జిల్లాలో 100 ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్లను తమ వితరణగా అందజేసి అందరి అభినందనలందుకున్నారు. మంత్రి డాక్టర్ అనిల్‌కుమార్ యాదవ్ విపిఆర్ సేవలను కొనియాడుతూ పేదల ఆరోగ్యం కోసం ముఖ్యమంత్రి తీసుకుంటున్న చర్యలకు తోడుగా విపిఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఇంతటి భారీ వితరణ చేయడం జిల్లా ప్రజల అదృష్టమన్నారు.

కోవిడ్ వ్యాప్తి ప్రారంభమైన తొలిరోజుల్లోనే విపిఆర్ ఫౌండేషన్ ద్వారా కోట్లాదిరూపాయలు వ్యయం చేసి పెద్ద ఎత్తున సహాయక కార్యక్రమాలు చేపట్టామని ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి తెలిపారు. గ్రామాల్లో ప్రజలకు ఆక్సిజన్ కొరత లేకుండా చేసేందుకు 10 లీటర్ల ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్లను అందిస్తున్నామని ఆమె చెప్పారు. గ్రామీణ ప్రజల కోసం ఇంతటి భారీ వితరణ చేసిన విపిఆర్ దంపతులను జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు అభినందించారు. జిల్లా ప్రజలందరి తరఫున వారికి తమ ధన్యవాదాలు తెలిపారు. జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, నుడా ఛైర్మెన్ ముక్కాల ద్వారకానాథ్, కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ఛైర్మెన్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మెన్ మెట్టుకూరు చిరంజీవిరెడ్డి, డిసిసిబి ఛైర్మెన్ సత్యనారాయణరెడ్డి, స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మెన్ మేరిగ మురళి, తిరుపతి ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్సీ బల్లి కల్యాణ్‌చక్రవర్తి, ఎమ్మెల్యేలు కాకాణి గోవర్ధనరెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, కిలివేటి సంజీవయ్య, రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డి, వరప్రసాద్, నగర మేయర్ స్రవంతి, డెప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, మునిసిపల్ కమిషనర్ దినేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# పల్లె ప్రజలు అప్రమత్తంగా ఉండాలి - డిపిఓ ధనలక్ష్మి

జిల్లాలోని పల్లెప్రాంతాల్లో కరోనా విజృంభించకముందే అధికారులంతా అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు కరోనా వ్యాధి పట్ల అవగాహన కలిగించాలని, గ్రామస్తులు తప్పనిసరిగా మాస్కులు పెట్టుకుని కరోనాకు దూరంగా ఉండాలని, మాస్కులు పెట్టకోకుంటే 100 రూపాయలు జరిమానా విధించాలని జిల్లా పంచాయతి అధికారి ధనలక్ష్మి అధికారులను ఆదేశించారు. దుకాణాల వద్ద, మార్కెట్ల వద్దా ఎక్కడా గుంపులుగా ఉండవద్దని, సామాజిక దూరం పాటించాలని, కోవిడ్ నిబంధనలు ప్రతిఒక్కరూ పాటించాలని ఆమె ఇటీవల సర్పంచ్‌లకు రాసిన లేఖలో స్పష్టం చేశారు. కరోనా నియంత్రణలో భాగంగా పంచాయతి కార్యదర్శులు, సచివాలయాల సంక్షేమ సిబ్బంది, ఏఎన్‌ఎంలు, వలంటీర్లు కరోనా పట్ల ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ ఎవరికైనా కరోనా సోకినట్లు గమనిస్తే వెంటనే క్విక్ రెస్పాన్స్ టీమ్‌ల ద్వారా వారిని ఆసుపత్రుల్లో చేర్చి చికిత్సలు అందించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. జగనన్న స్వచ్ఛ సంకల్పంలో భాగంగా ప్రతి పల్లెలోనూ పారిశుద్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని, చెత్తాచెదారాలను ఎప్పటికప్పుడు తొలగిస్తూ పల్లెల్లో పరిశుభ్ర వాతావరణం ఉండేలా చూడాలని ఆమె పేర్కొన్నారు.

### నిబంధనలు ఉల్లంఘిస్తే..
# కేసులు పెట్టండి



## పోలీసులకు జిల్లా ఎస్పీ ఆదేశం

కోవిడ్ కేసులు పెరుగుతున్న నేటి తరుణంలో కరోనాను కట్టడి చేసేందుకు రాత్రి వేళల్లో కర్ఫ్యూను అమలుచేస్తున్న నేపథ్యంలో పోలీసులు కర్ఫ్యూను కట్టుదిట్టంగా అమలు చేయాలని, నిబంధనలు ఉల్లంఘించినవారిపై కేసులు నమోదు చేయాలని జిల్లా ఎస్పీ సిహెచ్ విజయారావు పోలీసులను ఆదేశించారు. ఈనెల 18న నగరంలోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్‌హాలులో నగర పోలీస్ ఇన్స్‌పెక్టర్లతో సమావేశమైన ఎస్పీ, ప్రతిరోజు రాత్రి 11 నుంచి ఉదయం 5 గంటల దాకా కర్ఫ్యూ ఆంక్షలు అమలుచేయాలని, జనసంచారం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో పోలీస్‌పికెట్లు ఏర్పాటుచేయాలని చెప్పారు. ఎక్కడికక్కడ బారికేడ్లు ఏర్పాటుచేసి వాహనాల రాకపోకలను నియంత్రించాలన్నారు. కరోనా కట్టడికి ప్రజలందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఏఎస్పీ వెంకటరత్నం, ఎస్‌బి డిఎస్పీ ఎన్.కోటారెడ్డి, నగర పోలీస్ ఇన్స్‌పెక్టర్లు మధుబాబు, సుబ్బారావు, అన్వర్ బాషా, దశరథరామారావు, నరసింహారావు, రామకృష్ణలు పాల్గొన్నారు.

## వేణుగోపాలస్వామి దేవాలయంలో గోపూజోత్సవం



నెల్లూరు మూలాపేటలో ఉన్న రుక్మిణీ సత్యభామాదేవి సమేత శ్రీ వేణుగోపాలస్వామి దేవస్థానంలో ఈనెల 16న కనుమ పార్వేట ఉత్సవంలో భాగంగా గోపూజా మహోత్సవం వైభవంగా జరిగింది. ఆలయ ప్రాంగణంలో పొంగళ్ళు తయారు చేసి గోమహాలక్ష్మి పూజతో కనుమ పండుగను కన్నులపండువగా నిర్వహించారు. భక్తులందరితో గోపూజ చేయించి స్వామివారికి, గోమాతకు ప్రదక్షిణలు చేయించారు. పశువుల పండుగను పురస్కరించుకుని పశువుల కాపరికి సన్మానం చేసి దక్షిణతాంబూలాలు ఇచ్చారు. దేవాలయంలోని మంగళవాద్యకారులకు, ధనుర్మాస ప్రవచనాన్ని నిర్వహించిన ప్రముఖ పండితుడు శ్రీమాన్ ఎన్‌సిహెచ్ శ్రీనివాస అయ్యంగార్‌లకు ఘనసత్కారాలు చేశారు. ఆ తర్వాత స్వామివారికి పార్వేట ఉత్సవం, చెండు కోలాటం నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని ఈ ఉత్సవాలను తిలకించారు. ఆలయ ఛైర్మెన్ మజ్జిగ చంద్రమౌళిరెడ్డి, కార్యనిర్వహణాధికారి పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి, సూపరింటెండెంట్ వి.గిరికృష్ణ తదితరులు పర్యవేక్షించారు.

### పద్య సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో..
# స్వామి వివేకానంద జయంతి



నెల్లూరులోని పద్య సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో ఆదివల స్వామి వివేకానంద జయంతి వేడుకగా జరిగింది. స్థానిక ఏసి నగర్‌లోని యలమందయ్య స్కూల్ (వివేకానంద పాఠశాల)లో జరిగిన ఈ కార్యక్రమాన్ని యలమందయ్య ప్రారంభించగా, పరిషత్ అధ్యక్షులు పోలవరపు లక్ష్మీనరసింహారావు, ప్రధాన కార్యదర్శి చీమకుర్తి వెంకటేశ్వరరావులు సభను నిర్వహించారు. ప్రముఖ కవులు సూరం శ్రీనివాసులు, అగస్త్యరాజు సుబ్బారావు, అవధాని కోట రాజశేఖర్, తంగిరాల నరసింహకుమార్, తోట సులోచన తదితరులు పాల్గొని పద్యాలు, కవితలతో స్వామి వివేకానందను స్తుతించారు. పరిషత్ సభ్యులు రచించిన 'పాంచజన్య' అనే సంచికను ప్రముఖ నేత్రవైద్యులు బిరుదవోలు కృష్ణమూర్తి ఆవిష్కరించారు. ఉచ్చి భువనేశ్వరిప్రసాద్, నలుబోలు బలరామయ్యనాయుడు, తిరువతిస్వామి, పింగళి శ్రీనివాసరావు తదితరులు పాల్గొని స్వామి వివేకానంద బోధనలను వివరించారు.






# నెల్లూరు కబుర్లు



### జాతీయ గ్రామీణ ఉపాధి పనులను
# సమీక్షించిన కేంద్రబృందం

జిల్లాలో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా జరుగుతున్న పనులను, ప్రధానమంత్రి గ్రామీణ ఆవాస్ యోజన పథకం కింద నిర్మిస్తున్న గృహ నిర్మాణ పనులను కేంద్రబృందం పరిశీలించింది. జిల్లాకు విచ్చేసిన నేషనల్‌లెవల్ మోనిటరింగ్ టీమ్ సభ్యులు పి.సంతోష్, దీనా దేశాయి ఈ నెల 17న నెల్లూరుకు వచ్చి జిల్లా కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో కలెక్టర్ కె.వి.ఎన్. చక్రధర్‌బాబును కలిశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం పనులు మరియు ప్రధానమంత్రి గ్రామీణ ఆవాస్ యోజన పథకంలో భాగంగా నిర్మిస్తున్న గృహ నిర్మాణ పనుల గురించి నేషనల్ లెవల్ మోనిటరింగ్ టీమ్ సభ్యులతో కలిసి చర్చించారు. కలెక్టర్‌తో పాటు ఈ సమావేశంలో డ్వామా పీడీ తిరుపతయ్య, హౌసింగ్ పీడీ వేణుగోపాలరావు పాల్గొన్నారు.

### విఎస్‌యుతో..
# కెవిఆర్ సైంటిఫిక్ సర్వీసెస్ ఒప్పందం



నెల్లూరులోని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం వారు తమ విద్యార్థులకు ఆన్‌లైన్ తరగతుల నిర్వహణకు అవసరమైన సాంకేతికతను, మైక్రోసాఫ్ట్ సదుపాయాలను అందించేందుకు వీలుగా ప్రముఖ సంస్థ కెవిఆర్ సైంటిఫిక్ సర్వీసెస్‌తో ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈనెల 17న విఎస్‌యు ఉపకులపతి ఆచార్య జిఎం సుందరవల్లి, రిజిస్ట్రార్ డాక్టర్ ఎల్ విజయకృష్ణారెడ్డి మరియు వెంకటరెడ్డి, కెవిఆర్ సైంటిఫిక్ సర్వీసెస్ మైక్రోసాఫ్ట్ టీమ్స్ సర్వీస్ ప్రొవైడర్‌లు ఆ ఒప్పందంపై సంతకాలు చేసి ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. అధ్యాపకులకు కూడా ఇది ఎంతో ఉపయోగపడుతుందని, మైక్రోసాఫ్ట్ అందిస్తున్న ఇతర సదుపాయాలను అధ్యాపకులందరికి అందచేస్తారని, ఈ ఒప్పందానికి అయిదేళ్ళ కాలపరిమితి ఉంటుందని రిజిస్ట్రార్ ఎల్ విజయకృష్ణారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆచార్య సుజా ఎస్ నాయర్, డా.ఎం. హుస్సేనయ్య తదితరులు పాల్గొన్నారు.

### ఫ్రెండ్స్ వాకర్స్..
# సంక్రాంతి సంబరాలు



నెల్లూరులోని ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 15న స్థానిక ఏసి స్టేడియంలో సంక్రాంతి సంబరాలు జరిగాయి. వాకర్స్‌కు, క్రీడాకారులకు అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు పలగాటి శ్రీనివాసులురెడ్డి, గౌరవసలహాదారు నలుబోలు బలరామయ్యనాయుడు అరిసెలు, బెల్లం గవ్వలు పంపిణీ చేసి అందరి అభినందనలు అందుకున్నారు. కార్యదర్శి దాసరాజు సత్యనారాయణ, కోశాధికారి రావూరి సుబ్బారావు, వాకర్స్ మాజీ గవర్నర్ ఏకొల్లు రాఘవరెడ్డితో పాటు వాకర్స్ ప్రతినిధులు జివి కృష్ణయ్య, వినుకొండ వెంకటేశ్వర్లు, నజీర్‌అహ్మద్, డి.జయరామానాయుడు, సోను, మాగంటి ప్రసాద్, ఎల్.శ్రీనివాసులు, సూర్యనారాయణ, ఏవి సుబ్బరాజు, లక్ష్మణరాజు, చెంచయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

### తెలుగుజాతి గర్వించదగ్గ
# మహానేత.. ఎన్టీఆర్



ఎన్టీఆర్ విగ్రహానికి భారీ పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న టిడిపి నాయకులు

తెలుగుజాతి గర్వించదగ్గ మహానేత ఎన్టీఆర్ అని టిడిపి నాయకులు కొనియాడారు. మాజీముఖ్యమంత్రి, స్వర్గీయ నందమూరి తారక రామారావు వర్ధంతి సందర్భంగా ఈనెల 18న నెల్లూరులోని ఆర్ఆర్‌వీధిలో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి టిడిపి నాయకులు అబ్దుల్ అజీజ్, కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి తదితరులు భారీ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పలు డివిజన్లలోని టిడిపి నాయకులు అన్నదానాలు చేశారు. 47వ డివిజన్‌లో టిడిపి ఇన్‌చార్జి ధర్మవరం గణేష్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో టిడిపి నాయకులు అబ్దుల్ అజీజ్, కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ ఎన్టీఆర్ ఒక పార్టీకి చెందిన వ్యక్తి కాదని, ఆయన అందరివాడని అన్నారు. ప్రజల సంక్షేమం కోసం ఎన్టీఆర్ ఎన్నో పథకాలు ప్రవేశపెట్టారన్నారు. తెలుగుజాతి ఆత్మగౌరవాన్ని నిలబెట్టిన ఖ్యాతి ఎన్టీఆర్‌దేనన్నారు. ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాలు నెల్లూరునుంచే ప్రారంభమవుతాయన్నారు. నగర టిడిపి నాయకులు ధర్మవరపు సుబ్బారావు, జెన్ని రమణయ్య, కప్పిర శ్రీనివాసులు, జలదంకి సుధాకర్, సాబిర్‌ఖాన్, కనపర్తి గంగాధర్ పాల్గొన్నారు. నగరంలోని టిడిపి జిల్లా కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో టిడిపి నాయకులు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటుచేసి కార్యకర్తలు, అభిమానులు రక్తదానం చేశారు. నర్తకి సెంటర్‌లో ధర్మవరపు సుబ్బారావు ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.

# ఆటపాటలతో పాఠాలు చెప్పాలి



అంగన్‌వాడీ చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారాన్ని పరిశీలిస్తున్న ఐసిడిఎస్ పి.డి రోజ్‌మాండ్

చిన్నారులకు ఆటపాటలతో పాఠాలు చెప్పాలని, ప్రీస్కూల్స్ నిర్వహణను సమర్థవంతంగా చేపట్టాలని అంగన్‌వాడీ కార్యకర్తలకు ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ కెఎం రోజ్‌మాండ్ చెప్పారు. ఈనెల 18న నెల్లూరులోని కొండాయపాళెం పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె సందర్శించి చిన్నారులకు అందజేస్తున్న పౌష్టికాహారాన్ని పరిశీలించారు. గర్భిణులు, బాలింతలకు ఇస్తున్న వైఎస్సార్ సంపూర్ణ పోషకాహార కిట్లను క్రమం తప్పకుండా లబ్దిదారులకు అందించాలని ఆదేశించారు. కెవిన్నార్ ప్రాథమిక పాఠశాల, రాంనగర్, ఏకె నగర్ అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీస్కూల్స్ నిర్వహణను పరిశీలించి తగు సూచనలిచ్చారు. ఆమె వెంట నెల్లూరు అర్బన్ సిడిపిఓ అనూరాధ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు ప్రమీలమ్మ, రాజేశ్వరి పాల్గొన్నారు.

# పేద విశ్వబ్రాహ్మణ విద్యార్థులకు చేయూత

నెల్లూరులోని శ్రీ సారంపాటి వీరన్నాచారి విశ్వబ్రాహ్మణ విద్యానిధి సంస్థ ఆధ్వర్యంలో పలువురు పేద విశ్వబ్రాహ్మణ విద్యార్థులకు ఆర్థిక సాయం అందజేశారు. ఈనెల 16న ఆ సంస్థ అధ్యక్షుడు ఇనుకొండ చక్రపాణి అధ్యక్షతన జరిగిన సమావేశంలో 2021-22 విద్యాసంవత్సరానికి సంబంధించి వివిధ కాలేజీల్లో ఇంటర్, డిగ్రీ, బిటెక్, బి.ఫార్మసీ కోర్సులు చదువుకుంటున్న 44మంది పేద విద్యార్థినీ విద్యార్థులకు 57,100 రూపాయలు మంజూరుచేశారు. మారోజు సునీత 10వేలు, పాలపాటి అనూరాధ 10వేలు, పులికొలను జగదీష్, సుగుణ, రామ సుబ్బమ్మ, ఆలూరు కరుణాకర్, దయానంద, శ్రీధర్, ధరణి 3వేలు, 2వేలు వంతున విరాళాలిచ్చారని ఈ సందర్భంగా వారికి విద్యానిధి తరఫున ధన్యవాదాలు తెలియజేశారు. విద్యానిధి కార్యదర్శి పి.దయానంద, సభ్యులు టి.కొండాచారి, నారాయణరావు, ఆలూరు కామాక్షయ్య, బోయమడుగుల వెంకటశ్రీనివాసప్రసాద్, శ్రీహరికుమార్, దేవరాయపల్లె నాగార్జునాచారి తదితరులు పాల్గొన్నారు.

# ఇస్రోకి కొత్త సారథి



## ఛైర్మెన్‌గా.. సీనియర్ సైంటిస్ట్ డా.సోమనాథ్

అంతర్జాతీయ స్థాయిలో ఎంతో ప్రతిష్టాత్మకమైన భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ఛైర్మెన్‌గా సీనియర్ శాస్త్రవేత్త, రాకెట్ ఇంజనీరింగ్ నిపుణుడు ఎస్.సోమనాథ్ ఇటీవల నియమితులయ్యారు. ఇస్రో ఛైర్మెన్‌గా ఇప్పటిదాకా ఉన్న శివన్ పదవీకాలం ఈనెల 14తో ముగియడంతో ఆయన తర్వాత ఇస్రోకి కొత్త ఛైర్మెన్‌గా సోమనాథ్‌ను నియమిస్తూ డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్పేస్ నిర్ణయించింది. కేంద్ర క్యాబినెట్ కమిటీ ఆయన నియామకానికి ఆమోదం తెలిపింది. ఇస్రో 10వ ఛైర్మెన్‌గా సోమనాథ్ నియమితులయ్యారు. ఈ పదవిలో ఆయన మూడేళ్ల పాటు కొనసాగుతారు. జి.మాధవన్‌నాయర్, డాక్టర్ కె.రాధాకృష్ణ తర్వాత ఇస్రో ఛైర్మెన్ బాధ్యతలు చేపట్టిన మూడవ శాస్త్రవేత్త సోమనాథ్ కావడం విశేషం. రాకెట్ ఇంజనీరింగ్‌లో అత్యద్భుత



శివన్ నుంచి బాధ్యతలు స్వీకరిస్తున్న డా.సోమనాథ్

ప్రతిభావంతుడైన డా.సోమనాథ్ ఇస్రో ఛైర్మెన్‌గా నియమితులు కావడం పట్ల శాస్త్రవేత్తల్లో సర్వత్రా సంతోషం వ్యక్తమవుతోంది. ఈనెల 14న శివన్ పదవీకాలం ముగియడంతో ఆయన నుంచి సోమనాథ్ బాధ్యతలు స్వీకరించారు. జనవరి 14న డా.సోమనాథ్ అంతరిక్ష శాఖ కార్యదర్శిగా, అంతరిక్ష కమిషన్ ఛైర్మెన్‌గా పూర్తిస్థాయిలో బాధ్యతలు చేపట్టారు.

### డైరెక్టర్ నుంచి ఛైర్మెన్ స్థాయికి :

కేరళ రాష్ట్రానికి చెందిన డా.సోమనాథ్ ఎర్నాకుళంలో మధ్యతరగతి కుటుంబంలో పుట్టారు. తిరువనంతపురంలోని విక్రమ్ సారాబాయ్ స్పేస్ సెంటర్‌గా డైరెక్టర్‌గా 2018 నుంచి సోమనాథ్ వ్యవహరిస్తున్నారు. అంతకుముందు ఆయన రెండున్నరేళ్లపాటు లిక్విడ్ ప్రొపల్షన్ సిస్టమ్ సెంటర్ డైరెక్టర్‌గా ఉన్నారు. రాకెట్ ఇంజనీరింగ్ లాంచింగ్ వెహికల్స్ డిజైనింగ్‌లో ఆయన అపారమైన ప్రతిభను సాధించారు. కేరళలోని టికెఎం కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ (కొల్లాం)లో మెకానికల్ ఇంజనీరింగ్‌లో బిటెక్ పూర్తి చేసిన సోమనాథ్ ఆ తర్వాత బెంగుళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ నుంచి ఏరోస్పేస్ ఇంజనీరింగ్‌లో మాస్టర్స్ డిగ్రీ పూర్తిచేసి గోల్డ్‌మెడల్ సాధించారు. తొలుత 1985లో ఇస్రోలోని ప్రధాన కేంద్రమైన విక్రమ్ సారాబాయ్ స్పేస్‌సెంటర్‌లో చేరి అంచలంచెలుగా ఎదుగుతూ తన ప్రతిభను నిరూపించుకుంటూ వచ్చారు. అనతికాలంలో పిఎస్ఎల్‌వి ప్రాజెక్టు మేనేజర్‌గా, 2003లో జిఎస్ఎల్‌వి మార్క్-3 డెప్యూటీ ప్రాజెక్టు డైరెక్టర్‌గా నియమితులయ్యారు. జిఎస్ఎల్‌వి మార్క్-3 ప్రయోగానికి అన్ని విడిభాగాలను దేశంలోని వివిధ ఇస్రో కేంద్రాల నుంచి తీసుకొచ్చి వాటిని ఆ వాహకనౌకకు అనుసంధానం చేయడంలో డా. సోమనాథ్ పాత్ర కీలకం. ఆయన సారథ్యంలో 2014లో కేర్ మిషన్ ప్రయోగాన్ని విజయవంతంగా చేపట్టారు కూడా.

### సవాళ్లను అధిగమించాలి :

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లా శ్రీహరికోటలో ఉన్న భారత అంతరిక్ష పరిశోధనాకేంద్రం (ఇస్రో) ప్రపంచంలో ఎంతో పేరెన్నికగన్న అంతరిక్ష పరిశోధనా సంస్థ. 1983 నుంచి దాదాపు వందకు పైగా రాకెట్ ప్రయోగాలు విజయవంతంగా జరిపి గగనయానంలో ఘనచరిత్ర సృష్టించుకున్న సంస్థ ఇది. అయితే కరోనా నేపథ్యంలో గత రెండేళ్ళుగా కష్టాలు వచ్చిపడ్డాయి. రాకెట్ ప్రయోగాలు నెమ్మదించాయి. దానికి తగ్గట్టు అక్టోబరు, నవంబర్‌లలో తుఫాన్లు ముంచుకొచ్చాయి. దీంతో 2021లో ఒకే ఒక్క రాకెట్ ప్రయోగం మాత్రం జరిగింది. గత ఆగస్టులో జీఎస్ఎల్‌వి ప్రయోగం క్రయోజెనిక్ ఇంజన్‌లో సాంకేతికలోపం ఏర్పడినందువల్ల విఫలమైంది. ఇలాంటి సాంకేతికపరమైన సమస్యలన్నిటినీ ఇస్రో ముందుజాగ్రత్తతో అధిగమించాల్సి ఉంది. దేశవిదేశాల ఉపగ్రహాలను ఎంతో ధీటుగా అనుకున్న కక్ష్యలో చేర్చి లక్ష్యాలను సాధించడంలో తనకు తనే సాటి అనిపించుకున్న ఇస్రో కోవిడ్ కష్టకాలం ప్రారంభమైనప్పటి నుంచి పలురకాల సమస్యలనెదుర్కొంటూ ఉంది. తిరిగి కొత్త ఉత్సాహాన్ని పుంజుకోవాలి. అన్నిరకాల సమస్యలను, సవాళ్ళను ఎదుర్కొని తిరిగి ఇస్రో అంటే ఏమిటో తన సత్తా చాటుకోవాల్సి ఉంది. అంతరిక్షరంగంలో అపారమైన ప్రజ్ఞాపాటవాలున్న మన శాస్త్రవేత్తలు ఇప్పటికే దేశానికే గర్వకారణమైన సేవలందిస్తూనే ఉన్నారు. అపజయాలను విజయాలకు సోపానాలుగా చేసుకుని ధీటుగా రాణిస్తున్నారు కూడా. ఈ తరుణంలో ఇస్రో మరింత వేగం పుంజుకోవాలి. రాకెట్ ప్రయోగాలతో పాటు, చంద్రయాన్ వంటి క్లిష్టమైన అంతరిక్ష ప్రయోగాలను సైతం విజయవంతంగా చేపట్టేందుకు అన్నివిధాల పటిష్టమైన చర్యలు తీసుకోవాల్సి ఉంది. గగన విజయాలకు కేంద్రస్థానంగా కీర్తినందుకున్న ఇస్రో ఆ స్థాయిలో మళ్ళీ సగర్వంగా నిలబడాలి. అందుకు చేయాల్సిన కృషినంతా చేయాలి. రాకెట్ ఇంజనీరింగ్‌లో అద్భుతాలు సృష్టించగలిగే ప్రతిభాపాటవాలున్న డా. సోమనాథ్.. కొత్త బాధ్యతలతో ఇస్రో అధిపతిగా నియమితులయ్యారు కనుక ఆయన సారథ్యంలో ఇస్రో కీర్తిప్రతిష్టలు మరింత పెరుగుతాయని, మరిన్ని రాకెట్ ప్రయోగాలను విజయవంతంగా నిర్వహించి గగన విజయాలెన్నో సాధించి ఇస్రో తన ప్రతిభ చాటుకుంటుందని అందరూ ఆశిస్తున్నారు.

# నానో యూరియా ఎంతో ఉపయోగం

## - ఇఫ్కో మార్కెటింగ్ మేనేజర్ శ్రీధర్‌రెడ్డి

ఇఫ్కో కంపెనీవారు తయారుచేసిన నానో యూరియా లిక్విడ్ పంటపొలాలకు ఎంతో ఉపయోగకరమని ఇఫ్కో ఏపి స్టేట్ మార్కెటింగ్ మేనేజర్ శ్రీధర్‌రెడ్డి చెప్పారు. ఇటీవల మనుబోలులోని సింహపురి మ్యాచువల్లీ ఎయిడెడ్ మల్టీపర్పస్ కోఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ సంస్థలో ఇఫ్కో-న్యూఢిల్లీ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రైతుసదస్సులో ఆయన పాల్గొన్నారు. మూడేళ్ళ కృషి, ప్రయోగాల ఫలితంగా ఇఫ్కో కంపెనీ నానో యూరియా లిక్విడ్‌ను తయారుచేసిందని ఆయన వివరించారు. అరలీటరు బాటిల్‌లో ఉన్న నానో యూరియా ఒక ఎకరానికి స్ప్రే చేస్తే అది 45 కేజీల యూరియా బస్తాకంటే కూడా బాగా పనిచేస్తుందని ఆయన తెలిపారు. యూరియా బస్తా ధర కంటే తక్కువ ధరలోనే ఉన్న నానో యూరియా బాగా పనిచేసి



సత్ఫలితాలను ఇస్తోందని, దీనివల్ల రైతులు తక్కువ ఖర్చుతో ఎక్కువ ఫలితాలు పొందవచ్చని సొసైటీ అధ్యక్షులు, ఇఫ్కో ఆర్‌జిబి మెంబర్ తలమంచి సురేష్‌కుమార్‌రెడ్డి వివరించారు. మనుబోలు మండల రైతులతో పాటు ఇఫ్కో మార్కెటింగ్ ఆఫీసర్ అతావుల్లా, సొసైటీ డైరెక్టర్ తూమాటి శ్రీనివాసులురెడ్డి, ఇఫ్కో సెజ్ తరపున బొమ్మిరెడ్డి చైతన్య, సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ఇంజనీరింగ్ పట్టభద్రులకు సువర్ణావకాశం

## నెల్లూరులో 'టెర్రాలాజిక్' దిగ్గజ సంస్థ శాఖ ప్రారంభం



**ఇంజనీరింగ్ పట్టభద్రులకు ఇదో శుభవార్త. అందులోనూ ప్రత్యేకించి ఇది నెల్లూరు జిల్లా వాసులకు సువర్ణావకాశం. కనీవినీ ఎరుగుని రీతిలో ఓ అంతర్జాతీయ దిగ్గజ సంస్థ నెల్లూరులో తన శాఖను ప్రారంభించింది. ఇందులో నెల్లూరు యువతకు అపూర్వమైన ఉద్యోగ ఉపాధి అవకాశాలు రానున్నాయి. అమెరికా, కాలిఫోర్నియా తదితర 14 దేశాల్లో ప్రముఖ సాఫ్ట్‌వేర్ సంస్థగా ఉన్న 'టెర్రాలాజిక్ సొల్యూషన్స్' సంస్థ నెల్లూరులో శాఖను ప్రారంభించడం ఒక గొప్ప విశేషమైతే, ఆ సంస్థ అధినేత రెనిల్ కోమిట్ల మన నెల్లూరీయుడు కావడం, నెల్లూరులోని ఇంజనీరింగ్ పట్టభద్రులకు నెల్లూరులోనే ఉద్యోగాలను కల్పించాలనే ఆశయంతో ఈ శాఖను ప్రారంభించడం మరో విశేషం.**

సమాచార సాంకేతిక రంగాల్లో ఉద్యోగావకాశాలను పొందగోరేవారికి 'టెర్రాలాజిక్ సొల్యూషన్స్' చేరువలోకి వచ్చేసింది. ఉద్యోగాల కోసం ఎక్కడెక్కడో దూరప్రాంతాలకు వెళ్ళాల్సిన అవసరం లేకుండా సొంత ఊరిలోనే ఉద్యోగం పొందగలిగే అవకాశం రావడం కన్నా ఆనందం ఇంకేముంది!..సరిగ్గా ఆ సంతోషాన్ని మన ఇంజనీరింగ్ పట్టభద్రులకు కల్పించాలనే మహదాశయంతో రెనిల్ కోమిట్ల ఆ దిగ్గజ సంస్థను నెల్లూరులో ప్రారంభించి అందరి ప్రశంసలు అందుకుంటున్నారు. ప్రారంభదశలోనే కనీసం రెండువందల మందికిపైగానే ఈ సంస్థలో ఉద్యోగాలు లభిస్తాయని భావిస్తున్నారు.

'టెర్రాలాజిక్ సొల్యూషన్స్' అనేది ఎంతో ప్రఖ్యాతిచెందిన సమర్థవంతమైన సమాచార సాంకేతిక సేవల సంస్థ. ఒకేచోటు నుంచి ఇది అన్నిరకాల సాంకేతిక సేవలను అందిస్తుంది. సాఫ్ట్‌వేర్ తయారీ, సైబర్ సెక్యూరిటీ, క్లౌడ్‌సేవలు, యుఐయుఎక్స్ డిజైన్ సర్వీసులు కోరిన రీతిలో నిర్మించి ఇస్తుంది. అనేక డివైజ్‌లను కట్టింగ్‌ఎడ్జ్ డిజిటల్ సాంకేతిక మెళకువలను రూపొందించే సమర్థతతో పాటు నిర్మాణాత్మకంగా ఉంటూ నూతన ఆవిష్కరణలతో మంచి ఫలితాలు సాధించేలా ముందంజ వేస్తుంటుంది. ఈ సాఫ్ట్‌వేర్ కంపెనీ ఎన్నో రంగాల వారికి అవసరమైన సలహాలను, సూచనలను, సమాచార సాంకేతిక సేవలను అందజేస్తోంది. ముఖ్యంగా ఆటోమోటివ్, కమ్యూనికేషన్స్, నిర్మాణ రంగం, ఈ-కామర్స్, రిటైల్ ట్రావెల్, ట్రాన్స్‌పోర్టేషన్, పారిశ్రామిక రంగాలు ఇందులో ప్రధానమైనవి. అంతేకాదు, డ్రైవర్ సాంకేతిక సాధనాలను, ఫర్మ్‌వేర్ సాంకేతికతను, బోట్ లోడర్లను, వివిధ రంగాల సాంకేతిక సాధనాలను, మిడిల్‌వేర్‌ని, మల్టీమీడియా ప్యాకేజీ అభివృద్ధి రంగాలతోపాటు వినియోగదారులకు ఎంతగానో తోడ్పడుతుంది.

టెర్రాలాజిక్ సొల్యూషన్స్ సంస్థ శాఖ ప్రారంభోత్సవం నెల్లూరులోని మినర్వా గ్రాండ్ హోటల్‌లో ఈనెల 13న జరిగింది. ఈ కార్యక్రమంలో కంపెనీ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ రమాకిని మాట్లాడుతూ టెర్రాలాజిక్ సాఫ్ట్‌వేర్ సంస్థ ఎంతో సమర్థవంతమైనదని, అంతర్జాతీయ ఖ్యాతిగాంచిన ఈ సంస్థ ఉత్తమ ప్రమాణాలతో రాణిస్తోందని అన్నారు.

### నెల్లూరు యువతకు ఉద్యోగకల్పనే లక్ష్యం : రెనిల్ కోమిట్ల


నెల్లూరు యువతకు ఉద్యోగ కల్పనే తమ లక్ష్యమని, తాను నెల్లూరీయుడిని కావడంతో నెల్లూరులో ఈ సంస్థను అభివృద్ధి చేయాలనే ఆశయంతో ఇక్కడ సంస్థను ప్రారంభించామని సంస్థ సిఇఓ రెనిల్ కోమిట్ల అన్నారు. వచ్చే నాలుగేళ్లలో రెండువేల మంది ఇంజనీర్లకు ఉపాధి కల్పించే దిశగా అడుగులు వేస్తున్నట్లు చెప్పారు. మనం పుట్టిన ఊరును మనం అభివృద్ధి చేసుకోవాలనే ఆశయంతో ముందుకు సాగుతున్నామని ఆయన అందరి హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. టెర్రాలాజిక్ సంస్థల డైరెక్టర్ సందీప్‌కుమార్‌రెడ్డి మెట్టా, సంస్థ చార్టర్డ్ అకౌంటెంట్ చిన్ని శ్రావణ్‌కుమార్, కంపెనీ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ ఎన్. వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.




# యూపీలో చమటలు కక్కుతున్న... పార్టీలు!

ఉత్తరప్రదేశ్‌లో ఫిబ్రవరి 10న మొదలై, ఏడు విడతలుగా జరగనున్న ఎన్నికల్లో విజయం సాధించడానికి అటు బీజేపీ, ఇటు ఎస్పీ చెమటలు కక్కుతున్నాయనే చెప్పవచ్చు. మైండ్ గేమ్స్‌తో ఒకరి ఎత్తులకు రెండవ వారు పై ఎత్తులు వేస్తున్నారు ఈ ఎన్నికలు నిజానికి బీజేపీకే జీవన్మరణ సమస్య. బీజేపీ గెలవలేకపోతే ఆ ఓటమి ప్రకంపనలు ఢిల్లీలో ప్రతిధ్వనిస్తాయి. చాలా రాజకీయా సమీకరణలకు బీజం పడుతుంది. సమాజ్ వాది పార్టీకి పోయేది ఏమీలేదు. ఆ పార్టీకి అఖిలేష్‌యాదవ్ తిరుగులేని అధినేత. గెలిస్తే అధికారం. లేకపోతే ప్రతిపక్షనేతగా గౌరవం. వచ్చేసారి ఉట్టి కొట్టవచ్చు. బోలెడంత వయసు కూడా ఆయన పక్కనే ఉంది.

బీజేపీ పరిస్థితి అది కాదు. ఇప్పుడు గెలవకపోతే ఇక ముందు అధికారంలోకి రావడం కష్టమవుతుంది. అయోధ్యతో సహా హిందూత్వ కార్డులు అన్నీ ఇప్పుడు వాడేస్తున్నారు. అదీగాక, యోగి ఆదిత్యనాథ్ కేంద్రంలోని బీజేపీకి పెనుభారమయ్యే ప్రమాదం ఉంది. నూటికి రెండు వందల శాతం ఆర్.ఎస్.ఎస్‌కు ఆయన నమ్మిన బంటు. అందువల్ల ఆయనను ఖాళీగా ఉంచరు. లక్నో నుంచి ఢిల్లీకి ఆయనను షిఫ్ట్ చేసే ప్రమాదాన్ని చాలామంది బీజేపీయులు ఊహిస్తున్నారు. ఆయనను లక్నోకి పరిమితం చేయాలి అంటే ఉత్తరప్రదేశ్ ఎన్నికల్లో బీజేపీ గెలవాలి. ప్రతిపక్ష నాయకుడిగా ఆయన ఒక్క క్షణం కూడా... తనను తాను ఊహించుకోలేరు.






ఈ ప్రమాదాన్ని ముందే ఊహించిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కాలికి బలపం కట్టుకుని ఉత్తరప్రదేశ్‌లో తిరుగుతున్నారు. పొద్దుటిపూట బ్రేక్ఫాస్ట్ ఢిల్లీలో చేస్తే, లంచ్ ఉత్తర ప్రదేశ్‌లో చేస్తున్నారా అన్నట్టుగా రెస్ట్‌లెస్‌గా తిరుగుతున్నారు.

అయితే, సినిమా ఎలా తీస్తే హిట్ అవుతుందో సినీ నిర్మాతకు ఒక పట్టాన అర్థం కానట్టే 'అభివృద్ధి' జపం చేయాలా...! లేక, హిందుత్వ జపం చేయాలా అనే విషయం బీజేపీయులకు అర్థం కావడం లేదు. దాంతో, రెండూ కలిపి కొడుతున్నారు. అయోధ్య రాములు వారు, ద్వారక శ్రీ కృష్ణుల వారు, కాశీ విశ్వనాథుల వారి చిత్రపటాలను జేబుల్లో పెట్టుకుని తిరుగుతున్నారు. మధ్య మధ్యలో 'యిన్ని వేల కోట్ల' రూపాయల ప్రాజెక్టులకు 'అన్ని వేల రూపాయల' ప్రాజెక్టులకు మోదీజీ శంకుస్థాపనలు చేస్తున్నారు.

నిజానికి, యూపీ ఎన్నికల్లో బీజేపీ సునాయాసంగా గెలవాలి. ఈ రాష్ట్ర జనాభా 2011లోనే 20 కోట్లు. ఇప్పుడు ఏ పాతిక కోట్లో అయి ఉంటుంది. 403 శాసనసభా స్థానాలు. ఇంత పెద్ద రాష్ట్రంలో హిందూ, అనుబంధ మతాల వారి జనాభాయే 80 శాతం. ముస్లింలు, ఇతర హిందూయేతర జనాభా 20 శాతం. 80 :20 అనే నినాదాన్ని కూడా యోగి ఆదిత్యనాథ్ అందుకున్నారు. అయినా, గెలుస్తామనే నమ్మకం బీజేపీలో చాలా మందిలో కనపడడం లేదు. కారణం కులసమీకరణాలు. ఇక్కడ మతం కంటే కులమే ఎక్కువ ప్రభావశీలమైంది (ఆంధ్ర లాగా).

కులాల ప్రాతిపదికనే ముగ్గురుమంత్రులు, ఓ డజన్ మంది ఎం.ఎల్.ఏలు బీజేపీ లోంచి సమాజ్‌వాదీ పార్టీలోకి ఒక్క గెంతు గెంతారు. అయినప్పటికీ హిందూత్వ నినాదాన్ని చాలా బలంగా బీజేపీ జనంలోకి తీసుకువెడుతోంది.

ఇప్పుడు బీజేపీకి శాసనసభలోని 403 స్థానాలలో 303 స్థానాలు ఉన్నాయి. మోదీ హవా బలంగా ఉన్న 2017 నాటి రోజుల్లో వచ్చిన సీట్లు ఇవి. ఇప్పుడు అంత వైభోగం యూపీ బీజేపీకి లేదు. పైపెచ్చు రైతులు చాలా వ్యతిరేకతతో ఉన్నారు. మరోపక్క బీఎస్పీ ఆమె, కాంగ్రెస్ ప్రియాంకగాంధీ, ఆప్ కేజ్రీవాల్ ఈసారి బీజేపీ వ్యతిరేక ఓట్లు ఏమేరకు చీలుస్తారనేది చాలా ఆసక్తికరంగా మారింది. సమాజ్‌వాదీ పార్టీకి పడాల్సిన ఓట్లు చీలిస్తే బీజేపీ బయటపడుతుంది. బీజేపీ ఓట్లు చీలిస్తే బీఎస్పీ అధికారంలోకి వస్తుంది. మీడియా ప్రచారం, బీజేపీయేతర నాయకుల ప్రకటనలు చూస్తుంటే సమాజ్‌వాదీ పార్టీ విజయం సాధిస్తుంది అనే భావం కలగడం సహజం. అఖిలేష్ యాదవ్ ఆడుతున్న మైండ్‌గేమ్స్ ఆ స్థాయిలో ఉన్నాయి మరి. బీజేపీని ఆయన ఉక్కిరిబిక్కిరి చేస్తున్నారు.

ఉత్తరప్రదేశ్ శాసనసభలో మెజారిటీకి 202 సీట్లు చాలు. ఇప్పుడు బీజేపీకి 303 స్థానాలు ఉన్నాయి. అంటే అవసరమైన స్థానాల కంటే 100 స్థానాలు అదనంగా ఉన్నాయి. ఒక 75 –80 స్థానాలు తగ్గినా బీజేపీ తిరిగి అధికారంలోకి వచ్చే అవకాశాలు ఉన్నాయని ఢిల్లీలోని పాత్రికేయ మిత్రులు భావిస్తున్నారు. 220 నుంచి 230 స్థానాలు బీజేపీకి రావచ్చునన్నది ఒక అంచనా. బీజేపీ – ఎస్పీ మధ్య ముఖాముఖి పోటీ కాకపోవడం అనేది బీజేపీకి కలిసి వచ్చే అంశం. కాంగ్రెస్, బీఎస్పీ, ఆప్ పార్టీలు బీజేపీ వ్యతిరేక ఓట్‌నే పట్టుకెడతాయి అనే భావం రాజకీయ వర్గాలలో ఉంది. ఇది బీజేపీకి కలిసి వచ్చే అంశం.

అయితే ఒక విషయం మాత్రం సుస్పష్టం. బీజేపీపై భ్రమలు జనానికి చాలా వరకు తొలగిపోయాయి. అది బంగారం కాదని, గిల్టు నగేననే భావం సర్వత్రా వ్యాపిస్తున్నది. ఈసారి పార్లమెంట్ ఎన్నికల్లో ఉత్తరప్రదేశ్ ఓటర్లు బీజేపీకి చుక్కలు చూపించడం ఖాయం. ఇంకా రెండు సంవత్సరాల వ్యవధి ఉండడంతో బీజేపీ ప్రతిష్ట పలుచనైపోతోంది. వచ్చే ఏడాది రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి పదవులు రెండూ ఖాళీ అవుతున్నాయి. ఆ పదవులకు ప్రధాని మోదీ ఎవరిని ఎంపిక చేస్తారనే దానిని బట్టి కూడా బీజేపీపై ఒక అంచనాకు రావచ్చు.

యూపీలో గల 80 లోకసభ స్థానాల్లోనూ 2014లో బీజేపీ 71స్థానాలు గెలుచుకుంటే.. 2019లో 62 స్థానాలు గెలుచుకుంది. ఈ అంకె ఈసారి తిరగబడుతుందా అన్నంతగా బీజేపీ గ్రాఫ్ పడిపోతున్నట్టు కనబడుతోంది. యూపీలో అఖిలేష్, బెంగాల్‌లో మమతా బెనర్జీ, బీహార్‌లో తేజస్వియాదవ్, తెలంగాణలో కేసీఆర్, తమిళనాడులో స్టాలిన్, మహారాష్ట్రలో ఉద్ధవ్ థాక్రే, శరద్‌పవార్‌తో పాటుగా దేశంలోని వివిధ రాష్ట్రాలలో కనీసం వంద స్థానాలు తెచ్చుకోగలిగిన కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ జాతీయస్థాయిలో చేతులు కలపగలిగితే బీజేపీ జైత్రయాత్రకు బ్రేకులు పడవచ్చు. పంజాబ్‌పై బీజేపీకి ఆశలు ఏమీ లేవు. మిగిలిన మూడు రాష్ట్రాల్లోని గెలుపోటముల ప్రభావం జాతీయ రాజకీయాలపై ఉండదు.

యూపీ ఎన్నికల ఫలితాలు, ఓటింగ్ సరళి మొదలైనవి చాలా ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వవచ్చు.

**- భోగాది వేంకట రాయుడు**
bhogadirayudu2152@gmail.com

# విద్యాప్రదాత.. నేదురుమల్లి బాలకృష్ణారెడ్డి

## - జయంతి సభలో కొనియాడిన వక్తలు



ఎన్‌బికెఆర్ విద్యాసంస్థల వ్యవస్థాపకులు, దివంగత నేదురుమల్లి బాలకృష్ణారెడ్డి విద్యాప్రదాత అని, ఆ మహనీయుని సేవలు చిరస్మరణీయమని వక్తలు కొనియాడారు. స్వర్గీయ నేదురుమల్లి బాలకృష్ణారెడ్డి జయంతి ఈనెల 15న కోట మండలం విద్యానగర్‌లో ఉన్న ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఘనంగా జరిగింది. బాలకృష్ణారెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి అందరూ నివాళులర్పించారు. విద్యార్థులకు ఉన్నతమైన చదువులు అందుబాటులోకి వచ్చేలా నేదురుమల్లి బాలకృష్ణారెడ్డి స్థాపించిన విద్యాసంస్థల్లో వేలాది మంది విద్యార్థులు చదువుకుని వివిధ రంగాల్లో ఉత్తమస్థాయిలో రాణిస్తున్నారని, వారి ఉత్తమ ఆశయాలను గుర్తించిన కేంద్రప్రభుత్వం విశిష్టమైన పద్మశ్రీ పురస్కారాన్ని కూడా బహుకరించిందని కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.విజయకుమార్‌రెడ్డి అన్నారు. వేలాదిమంది పేద విద్యార్థులకు విద్యాదానం చేసి విద్యార్థుల హృదయాల్లో ఆయన చెరగని ముద్రవేసుకున్నారని, ఆయన స్థాపించిన విద్యాసంస్థల్లో ప్రత్యక్షంగా పరోక్షంగా వేలాదిమంది ఉపాధి పొందుతున్నారని అన్నారు. ఆ మహనీయుని అడుగుజాడల్లో అందరూ నడవాలని, వారి ఆశయాల సాధనకు విద్యార్థులంతా కృషిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎన్‌బికెఆర్ అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## హెచ్‌సిఎల్ కంపెనీకి.. 10 మంది ఎన్‌బికెఆర్ విద్యార్థులు

చెన్నైకి చెందిన ప్రముఖ బహుళజాతి కంపెనీ హెచ్‌సిఎల్‌కి కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన 10 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. ఇటీవల ఆ కంపెనీవారు ఆన్‌లైన్‌లోనే ఈ ఎంపికలను నిర్వహించారు. బిటెక్ చివరి సంవత్సరం చదువుతున్న సిఎస్‌ఇ, ఇసిఇ, ట్రిబుల్–ఇ విద్యార్థులు 64 మంది హాజరయ్యారు. వరుస పరీక్షలను నిర్వహించిన తర్వాత 10 మంది విద్యార్థులను ఎంపిక చేసుకున్నారు. వారికి వార్షిక వేతనం 3.6 లక్షల దాకా ఉన్నట్లు ప్రాంగణ ఎంపికల అధికారి డాక్టర్ ఎన్.కిషాందర్ తెలిపారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.విజయకుమార్‌రెడ్డి అభినందించారు. ఇప్పటిదాకా 2022 బ్యాచ్‌కు చెందిన తమ కళాశాల విద్యార్థులు 330 మంది దాకా వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు పొందినట్లు ఆయన ఈ సందర్భంగా చెప్పారు.

# గూడూరు డివిజన్ వార్తలు

# మద్యం బాబుల ఆట కట్టించండి

## - సి.ఐ నాగేశ్వరమ్మకు ఇన్సాఫ్, మైనారిటీల వినతి



సీఐకి వినతిపత్రం సమర్పిస్తున్న ఇన్సాఫ్ సమితి, మైనారిటీ నాయకులు

మద్యం బాబులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఈనెల 19న గూడూరు పట్టణ సీఐకి ఇన్సాఫ్ సమితి సభ్యులు, పట్టణ మైనారిటీలు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఇన్సాఫ్ సమితి జిల్లా కార్యదర్శి షేక్ జమాలుల్లా మాట్లాడుతూ గూడూరు పట్టణంలోని షాదీమంజిల్, దర్గావీధి, నవాజుకట్ట ప్రాంతాలలో రాత్రి ఆరు గంటలు దాటితే మద్యం బాబుల ఆగడాలు అధికమై పోతున్నాయని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఇన్సాఫ్ సమితి గూడూరు డివిజన్ అధ్యక్షులు షేక్ హాషిం మాట్లాడుతూ గత కొంతకాలంగా కొంతమంది యువకులు బహిరంగంగా దర్గావీధి, నవాజుకట్ట, మక్తబ్ ప్రాంతాలలో మద్యం సేవిస్తూ భయానక వాతావరణాన్ని సృష్టిస్తున్నట్లు తెలిపారు. అలాగే పట్టణంలో రద్దీగా ఉన్న ప్రాంతాలలో కొంతమంది యువకులు 100 కిలోమీటర్ల వేగంతో బైక్ రైడింగ్‌చేస్తూ పాదచారులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ సమస్యలపై వినతిపత్రం ఇచ్చిన వెంటనే సీఐ నాగేశ్వ రమ్మ స్పందించి తగిన చర్యలు తీసుకుంటామని చెప్పడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్సాఫ్ సమితి జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ చాన్‌బాషా, ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు చల్లా వెంకటేశ్వర్లు, ఇన్సాఫ్ సమితి సభ్యులు, మైనారిటీ నాయకులు జమీర్, వశీం, రాహుల్, ఆ ప్రాంత మహిళలు తదితరులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో

# ఆరుగురు డాక్టర్లకు కోవిడ్




గూడూరు ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్లు గత నాలుగు రోజుల నుండి ఒక్కొక్కరిగా కోవిడ్ బారినపడుతున్నారు. ఈ నెల 18న మరో డాక్టర్‌కి పాజిటివ్ అని తేలడంతో మొత్తం 6మంది డాక్టర్లు కోవిడ్ బారిన పడినట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. వీరితో పాటు వైద్య రంగానికి దగ్గరగా పనిచేసే అవుట్ సోర్సింగ్ సిబ్బంది కొందరికి కూడా కోవిడ్ పాజిటివ్ అని తెలుస్తోంది. కాగా, గూడూరు ప్రభుత్వ ఆసుపత్రిలో ఇంకా కోవిడ్ రోగులకు ప్రత్యేక వార్డులు, సౌకర్యాలు కల్పనలో అధికారులు వెనుకంజలో ఉన్నారు. అత్యంత వేగంగా దూసుకువస్తున్న కరోనా మూడో వేవ్ నుండి తప్పించుకోవాలంటే ప్రజలు కరోనా నిబంధనలు పాటించాల్సిందే!

## వైభవంగా శ్రీ మహాలక్ష్మమ్మ గ్రామోత్సవం



కోటలోని శ్రీ మహాలక్ష్మమ్మ గ్రామోత్సవాన్ని ఈ నెల 16వ తేదీ ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలకు కోట మాజీ ఎంపిపి నల్లపరెడ్డి వినోద్‌రెడ్డి హాజరై అమ్మవారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం మేళతాళాల మధ్య వినోద్‌కుమార్‌రెడ్డిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో కోట ఉపసర్పంచ్ గాది భాస్కర్, వార్డు మెంబర్లు, మహాలక్ష్మమ్మ యూత్, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# షటిల్ పోటీల్లో విజేతలకు బహుమతులు



బహుమతులందజేస్తున్న ఫ్రెండ్స్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ నిర్వాహకులు

సంక్రాంతి పండుగ సందర్భంగా నాయుడుపేటలోని ఇండోర్ కోర్టు స్టేడియంలో రెండురోజుల పాటు పోటాపోటీగా జరిగిన డివిజన్ స్థాయి షటిల్ పోటీల్లో విజేతలకు ఈనెల 14న బహుమతులందజేశారు. ఫ్రెండ్స్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ పోటీలు జరిగాయి. గూడూరుకు చెందిన రూపేష్, సాయి ప్రథమ బహుమతిని సాధించగా, నాయుడుపేటకు చెందిన గోరే, మస్తాన్ ద్వితీయ బహుమతిని సాధించుకున్నారు. అరుణ్, సందీప్‌లు తృతీయ బహుమతిని అందుకున్నారు. అరుణ్‌కుమార్ బెస్ట్ ప్లేయర్‌గా అందరి ప్రశంసలందుకున్నాడు. విజేతలకు పోటీల నిర్వాహకులు నగదు ప్రోత్సాహక బహుమతులందజేశారు. దాతలు సురేష్, మహేష్‌తో పాటు అసోసియేషన్ నిర్వాహకులు పాల్గొన్నారు.

# ఆలయ పాలకమండలి ఛైర్మెన్లకు సన్మానాలు

పొదలకూరులోని శివాలయం, పోలేరమ్మ దేవస్థానాలకు నూతన పాలకమండలి ఛైర్మెన్లుగా ఎంపికైన తన్నీరు సుబ్రహ్మణ్యం, ఎం శేఖరబాబులను జడ్పీటిసి సభ్యురాలు నిర్మల, సర్పంచ్ చిట్టెమ్మ, ఉపసర్పంచ్ వాకాటి శ్రీనివాసులురెడ్డిలతో పాటు దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ కోనం బ్రహ్మయ్య, రమణారెడ్డి, వెంకటేశ్వర్లు, వాసు, లక్ష్మీకల్యాణి తదితరులంతా కలసి ఇటీవల ఘనంగా సన్మానించారు. సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డికి సహచరులైన వారిరువుర్ని అభినందించి, ఆలయాల అభివృద్ధికి కృషి చేయాలని వారంతా ఆకాంక్షించారు.

# అనాధ బాలలకు చేయూత



నూతన వస్త్రాలను అందజేస్తున్న మానవసేవే మాధవసేవ సభ్యులు

కోవూరులోని న్యూ లైఫ్ చిల్డ్రన్స్ హోంలోని హెచ్ఐవి బాధిత అనాధ బాలలకు స్థానిక 'మానవ సేవే మాధవసేవ' బృందం వారు సంక్రాంతి పండుగ సందర్భంగా నూతన వస్త్రాలను బహుకరించారు. చిన్నారులందరికీ తినుబండారాలు పంచారు. చిల్డ్రన్స్ హోం నిర్వాహకుడు సాల్మన్‌ను సత్కరించారు. కోలా రవి, కోలా సుప్రియ, ఆర్. ఇందిర, ఏ. పరిమళ తదితర బృంద సభ్యులతో పాటు బాలఅచ్యుత్, పర్ణిక, తోట మురళి, మీనా, రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# జొన్నవాడలో నిత్యాన్నదానానికి విరాళం



విరాళాన్ని ఆలయ ఇఓకు అందజేస్తున్న దాతలు

జొన్నవాడలోని శ్రీ కామాక్షితాయి అమ్మవారి ఆలయంలో నిత్యాన్నదాన సదనానికి ఇటీవల బుచ్చిరెడ్డిపాళెంకు చెందిన దాతలు దుగ్గిశెట్టి రమేష్, మారుతీ కామాక్షి దంపతులు చవల కాంతమ్మ, రమణయ్య, ఇందుమతిల జ్ఞాపకార్థం లక్షా వెయ్యినూట్ల పదహార్లు విరాళంగా అందజేశారు. ఆలయ ఇ.ఓ శ్రీనివాసులురెడ్డికి విరాళం మొత్తాన్ని అందజేయగా, ఆలయ నిర్వాహకులు దాతలకు స్వామి, అమ్మవార్ల వద్ద ప్రత్యేకపూజలు చేయించి ఆశీస్సులు అందజేశారు.

# కోటలో సంక్రాంతి ముగ్గుల పోటీలు

మండల కేంద్రమైన కోటలోని నార్త్ గిరిజనకాలనీలో ఇటీవల నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు జరిగాయి. ఎంతో ఉత్సాహభరితంగా సాగిన ఈ పోటీల్లో పెద్దసంఖ్యలో మహిళలు పాల్గొని ముగ్గులు వేశారు. ఈ పోటీల్లో నందిని ప్రథమ బహుమతిని సాధించగా, ద్వితీయ తృతీయ బహుమతులు మునెమ్మ, ప్రసన్న గెలుచుకున్నారు. అనంతరం నిర్వాహకులు విజేతలకు బహుమతులు అందజేశారు. బిజెపి మండల అధ్యక్షుడు రమేష్‌బాబుతో పాటు కోట యూత్‌క్లబ్ అధ్యక్షుడు పరశురాం సాయి, బండి రమణయ్య, లీలావతి తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా వైకుంఠ ఏకాదశి..

# ఉత్తర ద్వారదర్శనం

## రంగనాథస్వామి దేవాలయానికి పోటెత్తిన భక్తజనం



ముక్కోటి వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా నెల్లూరు నగరంలోని వైష్ణవాలయాల్లో ఎంతో భక్తిశ్రద్ధలతో వేడుకలు నిర్వహించారు. నెల్లూరు రంగనాయకులపేటలో కొలువైవున్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీ తల్పగిరి రంగనాథస్వామి దేవాలయంలో ఉత్తరద్వార దర్శనానికి భక్తులు పోటెత్తారు. వేకువనుంచే స్వామివారికి, అమ్మవార్లకు విశేషపూజలు, అభిషేకాలు చేపట్టి, విశిష్టమైన అలంకారాలు చేసి భక్తులను స్వామివార్ల దర్శనాలకు అనుమతించారు. జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు, జిల్లా ఎస్పీ సిహెచ్ విజయారావులతో పాటు అనేకమంది ప్రముఖులు, పలువురు ప్రజాప్రతినిధులు స్వామివార్లను దర్శించుకున్నారు. రంగనాథస్వామి దేవాలయంలో ఈనెల 23వ తేది దాకా ఉత్తర ద్వారదర్శనం ఉంటుందని, ప్రతిరోజు ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల దాకా, సాయంత్రం 5.30 నుంచి రాత్రి 8 గంటల దాకా భక్తులు వైకుంఠద్వారం ద్వారా స్వామివారిని దర్శించుకోవచ్చని ఆలయ ఇఓ వెంకటేశ్వర్లు తెలియజేశారు.

# రక్తదానం చేసిన వావిలేరు యువకులు



రక్తదానం చేస్తున్న వావిలేరు గ్రామ యువకులు

చేజర్ల మండలంలోని వావిలేరు గ్రామ యువకులు సుమారు 40 మంది రక్తదానం చేసి తమ సేవాభావం చాటుకున్నారు. రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో వావిలేరు ప్రాథమిక పాఠశాలలో ఈనెల 14న ఏర్పాటుచేసిన రక్తదానశిబిరంలో వారు పాల్గొని రక్తదానం చేశారు. రక్తదానం ప్రాణదానమని, బాధితుల ప్రాణాలు కాపాడే రక్తదానం విశిష్టతను అర్థం చేసుకుని యువకులు ముందుకువచ్చి రక్తదానం చేయడం ఎంతో సంతోషదాయకమని స్థానిక వైకాపా నాయకుడు రత్నంనాయుడు వారిని అభినందించారు. 40 యూనిట్ల రక్తదానం చేసి వారు రెడ్‌క్రాస్‌కు అందించారు.

# చోళుల కాలం నాటి..చెన్నూరు చెన్నకేశవాలయం

*భక్తవరదుడు.. భక్తుల బాధలు తీర్చి, కోరిన కోర్కెలు తీర్చే ఆపద్బాంధవుడు చెన్నకేశవుడని ప్రతీతి. అందుకే వైష్ణవాలయాల్లో చెన్నకేశవ దేవాలయాలు మరింత ప్రత్యేకత సంతరించుకున్నాయి. ఎంతో అందమైన శిల్పకళతో ఉండే ఈ ఆలయాలను నాటి రాజుల కాలంలో అనేక ప్రాంతాల్లో నిర్మాణం చేయించి పూజలు చేశారు. ప్రత్యేకించి చెన్నకేశవారాధన నాటి రాజుల కాలం నుంచే ఉంది. 'చెన్న' అంటే అందమైన అని అర్థం. కేశవుడంటే మహావిష్ణువు. చెన్నకేశవస్వామి పేరుతో మహావిష్ణువు వెలసిన ఆలయాలే చెన్నకేశవస్వామి దేవాలయాలుగా ప్రసిద్ధి. నెల్లూరుజిల్లాలోనూ అలాంటి పురాతన ఆలయాలు పలుచోట్ల ఉన్నాయి. వాటిలో చెప్పుకోదగిన చెన్నకేశవాలయం గూడూరు నియోజకవర్గంలోని చెన్నూరు గ్రామంలో ఉంది. చెన్నకేశవస్వామి వెలసివున్న ఊరు కనుక ఆ గ్రామానికి 'చెన్నూరు' అని పేరు వచ్చిందని కూడా అంటుంటారు. భక్తుల కొంగుబంగారంగా వెలసిన ఈ దేవాలయానికి ఎంతో ఘనమైన చరిత్ర ఉంది.*





మన దేవాలయాలు (83)

గూడూరు నుంచి వెంకటగిరికి వెళ్ళే దారిలో సుమారు 7 కిలోమీటర్ల దూరంలో చెన్నూరు గ్రామం ఉంది. ఇది మేజర్ పంచాయతీ. పెద్ద చెరువు కూడా ఉంది కనుక వ్యవసాయానికి లోటులేదు. చుట్టూ ప్రకృతి ఆహ్లాదకరమైన వాతావరణంతో, ఉన్న చెన్నూరులో పురాతన కాలం నుంచి ఉన్న ఆలయాల్లో శివాలయం, చెన్నకేశవాలయం ఎంతో ప్రసిద్ధి. 11-12వ శతాబ్దాల కాలంలో చోళరాజులు ఎంతో భక్తిశ్రద్ధలతో చెన్నూరులో శ్రీదేవి భూదేవి సమేత శ్రీ చెన్నకేశవస్వామి దేవాలయం నిర్మించినట్లు చరిత్ర. ఈ ఆలయం ఎంతో సుందరమైనది. విశాలమైన స్థలంలో మనోహరమైన శిల్పాలతో రూపుదిద్దుకున్న ఈ ఆలయాన్ని ఆ తర్వాత కాలంలో విజయనగర రాజులు మరింతగా అభివృద్ధి చేశారు. నాటి రాజులకాలం నుంచి నేటికీ చెక్కుచెదరకుండా నాటి ఆలయ శిల్పకళా వైభవంతో అలరారుతూ ఉండే ఎంతో అరుదైన, అపురూపమైన దేవాలయం చెన్నూరు చెన్నకేశవాలయం.

## నేత్రపర్వం చేసే శిల్పకళ:

చెన్నకేశవస్వామి దేవాలయంలో అడుగడుగునా శిల్పకళ నయనమనోహరంగా ఉంటుంది. తూర్పున ఉన్న ఆలయ గాలిగోపురం కాలగర్భంలో కలసిపోయినా, ఆలయ ప్రాంగణమంతా ఆధ్యాత్మిక భక్తి వాతావరణంతో భక్తులను పరవశింపజేస్తుంటుంది. అడుగడుగునా అపురూపమైన శిల్పాలతో ఆలయనిర్మాణం జరిగింది. గర్భాలయంలో అత్యద్భుతమైన రీతిలో ఆరున్నర అడుగుల ఎత్తుతో సుప్రశాంత సుందర వదనుడై శ్రీ చెన్నకేశవస్వామి భక్తులకు అభయప్రదాతగా కొలువై ఉంటాడు. గర్భగుడి గోడల చుట్టూ కూడా వివిధ దేవతామూర్తుల శిల్పాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకుంటూ ఉంటాయి. ఆలయ ప్రాంగణంలో ఆళ్వార్ మందిరం కూడా ఉంది. రాజుల కాలంలో ఎంతో వైభవంగా ఉన్న ఈ ఆలయం కాలక్రమంలో శిథిలమైంది. ఆలయం గోడలు బాగా దెబ్బతిన్నాయి. గ్రామస్తులు శ్రద్ధాభక్తులతో వాటిని పునరుద్ధరించారు. దాతలు, భక్తులందరూ కలసి దాదాపు వెయ్యేళ్ళ నాటి ఈ ఆలయాన్ని జీర్ణోద్ధరణ గావించి ఇటీవలి కాలంలో మరింతగా అభివృద్ధి చేశారు. ఆలయానికి దక్షిణ భాగంలో కల్యాణమండపాన్ని నిర్మించారు. ఉత్సవాల సందర్భాల్లో భజనలు, భక్తి కార్యక్రమాలకు వేదికగా ఉన్న ఈ ఆలయంలో శ్రీకృష్ణభగవానుని విగ్రహమూర్తిని కూడా నెలకొల్పి భక్తులకు కన్నులపండువ చేశారు. చెన్నకేశవస్వామిని పూజిస్తే ఆరోగ్యానికి శౌర్యానికి ఐశ్వర్యానికి కొదవ ఉండదని, కష్టాలు తీరిపోయి జీవితాల్లో శుభాలు వెల్లివిరుస్తాయని భక్తుల విశ్వాసం.

## వైభవంగా ముక్కోటి పూజలు:

చెన్నకేశవస్వామికి, అమ్మవార్లకు నిత్యపూజలతో పాటు పర్వదినాల్లోనూ, విశేషమైన రోజుల్లోనూ ఆలయ అర్చకులు విశిష్ట పూజలు, సేవలు చేస్తుంటారు. ప్రతి శనివారం రోజున స్వామివారికి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తుంటారు. ప్రతిఏటా ముక్కోటి ఏకాదశి నాడు ఆలయంలో వైకుంఠద్వార దర్శనం ఉంటుంది. స్వామివారికి ముక్కోటి పూజలు ఘనంగా నిర్వహిస్తారు. ఆలయ నిర్వాహకులు ఆ రోజున ఆలయాన్నంతా విద్యుద్దీపాలంకరణలతో, పుష్పాలంకరణలతో శోభాయమానం చేస్తారు. భక్తులు వెల్లువగా తరలివచ్చి స్వామివార్లను వైకుంఠద్వారం ద్వారా దర్శించుకుని తరిస్తుంటారు. అదే రోజున శ్రీదేవి భూదేవి సమేతుడైన శ్రీ చెన్నకేశవస్వామికి గ్రామస్తులు అంగరంగవైభవంగా గ్రామోత్సవాన్ని నిర్వహిస్తారు. జిల్లాలోని అనేక ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి ఈ ఉత్సవంలో పాల్గొంటారు.

### మాగుంట లే అవుట్

# విజ్ఞాన పార్కుకు వివాదాల విఘ్నాలు

## ● ప్రభుత్వం పక్కా ఆధారాలు చూపించినా సంతృప్తి చెందని అక్రమార్కులు




కేంద్ర ప్రభుత్వ సహకారంతో నెల్లూరు నగర కార్పొరేషన్ నగరంలోని మాగుంట లే అవుట్‌లో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన విజ్ఞాన వనం(సైన్స్ పార్కు) వివాదానికి ఇంకా ఫుల్‌స్టాప్ పడడం లేదు. గతంలో పనులు ప్రారంభించిన వెంటనే ఈ భూమి వక్ఫ్‌బోర్డుకి చెందిందంటూ కొంతమంది ముస్లిం సోదరులు అభ్యంతరం తెలుపడంతో పనులు అర్ధాంతరంగా ఆగిపోయాయి. ఈ విషయమై జిల్లా కలెక్టర్, మునిసిపల్ ప్రతినిధులు, వక్ఫ్ బోర్డు కమిషనర్ గత సెప్టెంబర్‌లో సమగ్రంగా దర్యాప్తు జరిపి, దస్త్రాలన్నీ పరిశీలించి ముస్లిం సోదరులకు సంబంధించిన వక్ఫ్ బోర్డు స్థలం బాలాజీనగర్‌లో ఉందని నిర్ధారించారు. రెండు సర్వే నంబర్లు దగ్గరగా ఉండడంతో ఈ గందరగోళం ఏర్పడిందని తేల్చేశారు. బాలాజీనగర్‌లో ఉన్న ముస్లిం సోదరుల భూమి ఎప్పుడో పురానా జమానాలోనే ఆక్రమణకు గురికాబడిందని కూడా గుర్తించినట్లు తెలిపారు. ఉత్తర ప్రత్యుత్తరాలు, దర్యాప్తులు, పరిశీలనల అనంతరం ఆగిపోయిన పనులను మళ్ళీ ప్రారంభించ డానికి సంసిద్ధమయ్యారు.

సమస్య సమసిపోయిందనుకున్న అధికారులు అర్ధాంతరంగా నిలిచిపోయిన పనులను మళ్ళీ మొదలుపెట్టారు. సుమారు ఆరు ఎకరాల స్థలంలో 20 కోట్ల రూపాయల వ్యయంతో దక్షిణ భారతదేశంలోనే తొలిసారిగా ఈ తరహా విజ్ఞాన పార్కును నెలకొల్పబోతున్నట్లు ప్రకటించారు. ఆరు నెలల వ్యవధిలో పనులు పూర్తిచేయడానికి లక్ష్యాన్ని నిర్ధేశించుకుని కొత్త ఏడాదిలో జనవరి 3వ తేదీన ఆర్భాటంగా పనులు పునఃప్రారంభించారు. అయితే సాక్షాత్తు వక్ఫ్ బోర్డు కమిషనర్, జిల్లా కలెక్టర్ స్థాయి అధికారులు సంయుక్తంగా సర్వే నిర్వహించి ఇచ్చిన వివరణతో కూడా కొంత మంది సంతృప్తి చెందడంలేదు. పనులు జరగనిచ్చే ప్రసక్తే లేదంటూ మళ్ళీ ఉద్యమబాట పట్టారు.

### రెచ్చగొట్టే తరహాలో వివాదాస్పద వ్యాఖ్యలు

మాతో పెట్టుకుంటే గతంలో ఉన్నతాధికారుల గతేమయిందో గుర్తులేదా అంటూ వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తూ బహిరంగంగానే సవాళ్ళు విసురుతున్నారు కొందరు. తమకు అండగా అన్ని రాజకీయ పార్టీలతోపాటు, జాతీయ స్థాయి సంస్థలు కూడా ఉన్నాయంటూ భయపెట్టే ధోరణిలో వ్యాఖ్యానిస్తున్నారు. తమతో పెట్టుకుంటే కలెక్టర్, కమిషనర్, ఎస్‌పిలను క్షణాల్లో బదిలీ చేయిస్తామంటూ వార్నింగులు ఇస్తున్నారు. ఇంకా ఒకడుగు ముందుకేసి మునిసిపల్ కమిషనర్ మాగుంట కుటుంబం దగ్గర 5 కోట్లు ముడుపులు తీసుకున్నారంటూ ఆరోపిస్తున్నారు. బోడిగుండుకు మోకాలికి ముడిపెడుతున్నట్లుగా మాగుంటోళ్ళకి, వాళ్ళెప్పుడో ప్రభుత్వానికి స్వాధీనపరచిన స్థలానికి సంబంధమేమిటో ఆ ఘనుడే సమాధానం చెప్పాలి. ప్రభుత్వ రికార్డులను, వాస్తవ పరిస్థితులను గుర్తించకుండా తాను పట్టిన కుందేలుకి మూడే కాళ్ళు అన్నట్లుగా వ్యవహరించడం మంచిది కాదు. మాగుంట లే అవుట్ నివాసితులు 'సైన్స్ పార్కు పరిరక్షణ సమితి'గా ఏర్పడి పార్కు సంరక్షణకు సమాయత్తమవుతున్నారు. మత సంస్థలను అడ్డం పెట్టుకుని అభివృద్ధిని అడ్డుకుంటే సహించబోమని పరిరక్షణ సమితి సభ్యులు హెచ్చరిస్తున్నారు. మరోవైపు ఈ వివాదంలోకి మాగుంట సంస్థను లాగడం సమంజసం కాదని, సంస్థకు... స్థలానికి ఎలాంటి సంబంధం లేదని సంస్థ ప్రతినిధి విజయభాస్కర రెడ్డి అంటున్నారు. వివాదం ప్రభుత్వానికి వక్ఫ్ బోర్డుకి మధ్య మాత్రమేనని, అది కూడా సమసిపోయిందని, కొందరు స్వార్ధ పూరితంగా పనికట్టుకుని నిందలు వేయడం సరికాదని పరిరక్షణ సమితి సభ్యులు చెప్తున్నారు.

అవతల వ్యక్తులు రెచ్చగొట్టే విధంగా చేస్తున్న విద్వేషపూరితమైన వ్యాఖ్యలపై చర్యలు తీసుకుని పార్కు అభివృద్ధికి సహకరించవలసినదిగా రాజకీయ నేతలను, అధికారులను సమితి సభ్యులు కోరుతున్నారు.

### సినిమా గోల

# విందుతో మెగా మందు

## జగన్ - చిరుల లంచితో కంచికి చేరిన కథ

గత కొద్ది వారాలుగా రాజకీయ రొచ్చుగా మారిన సినిమా టిక్కెట్ల రచ్చ ఎట్టకేలకు తాత్కాలికంగా సద్దుమణిగింది. హైదరాబాదు నుండి గన్నవరానికి ఒక గంట చార్టెడ్ ఫ్లైట్ ప్రయాణం, అక్కడినుండి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇంటికి వెళ్ళి ఒక గంటా 20 నిముషాల విందు భోజనంతో మొత్తం గందరగోళానికి ఫుల్‌స్టాప్ పెట్టేశారు మెగాస్టార్ చిరంజీవి. తాను సినిమా పెద్దగా రాలేదు, బిడ్డగా వచ్చాను అంటూనే పెద్దరికాన్ని ప్రదర్శించారు చిరు. సినిమా రంగంలో తలపండిపోయిన చిరంజీవి, కొద్దికాలం కాంగ్రెస్‌తో చేసిన దోస్తీ పుణ్యమా అని రాజకీయాలలో కూడా ఆరితేరి పోయారనడానికి ఈ సంఘటనే పెద్ద ఉదాహరణ.

ఇటీవల సినిమా టిక్కెట్ల విక్రయాలను ఆన్‌లైన్ చేయడంతో పాటు ధరలను కూడా తగ్గించే విషయంలో ఆంధ్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుని జి.ఓ జారీ చేయడం అందరికీ తెలిసిన విషయమే. అప్పటినుండి అటు సినీ పరిశ్రమకు చెందినవారు, ఇటు రాజకీయ నాయకులు ఎవరికి తోచిన విధంగా వాళ్ళు విమర్శలు, ప్రతి విమర్శలు చేసుకోవడం మనం తరచూ చూస్తున్నాం, వింటున్నాం కూడా. సినిమా వాళ్ళు బలిసి కొట్టుకుంటున్నారు అంటూ మాజీమంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి చేసిన వ్యాఖ్య మరీ దుమారాన్ని రేపింది. ఒకానొక దశలో తమ్మారెడ్డి భరద్వాజ్ కొంచెం తీవ్రంగానే స్పందించి రాజకీయ నాయకులు ఆస్తులు, లెక్కలు, బహిరంగ చర్చల దాకా వెళ్లారు.

ఇలా మరీ ముందుకెళ్తే ఏమవుతుందనుకున్నారో ఏమో ఇటు పొలిటికల్ స్టార్ జగన్‌మోహన్‌రెడ్డి, అటు మెగాస్టార్ చిరంజీవి కలుసుకున్నారు. ఇద్దరు కలసి హాయిగా ఓ గంటసేపు భోజనం చేస్తూ మాట్లాడుకున్నారు. లోపల వాళ్ళిద్దరూ ఏం మాట్లాడుకున్నారో కూడా ఎవరికీ తెలియదు. సమస్య పట్ల జగన్ సానుకూలంగా స్పందించారని, తనకు జగన్ శ్రీమతి భారతి భోజనం వడ్డించారని చెప్పి మళ్ళీ చార్టెడ్ విమానం ఎక్కి హైదరాబాదుకు చెక్కేశారు చిరంజీవి. మొత్తానికి ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం ఎప్పుడు లభిస్తుందో తెలియదుకాని వివాదానికి మాత్రం తాత్కాలిక ఉపశమనం లభించింది. వీరి విందు ఒక సమస్యకు తాత్కాలిక మందుగా సినీవర్గాలు పేర్కొంటున్నాయి.

### దళారులను నమ్మి

# మోసపోవద్దు

## రైతులకు పౌరసరఫరాల సంస్థ మేనేజర్ సూచన

ఈ వ్యవసాయ సీజన్‌లో వరి ధాన్యం కొనుగోలు చేసేందుకు అన్ని రైతు భరోసా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు చేశామని, రైతులు దళారులను నమ్మి మోసపోకుండా తాము పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటుచేసిన ఈ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించుకోవాలని పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ పద్మ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో ఈసారి 18 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతుందని జిల్లా వ్యవసాయశాఖ అంచనా వేసిందని, ముందుగా వరిపంట చేతికి అందివచ్చే సూళ్ళూరుపేట, దొరవారిసత్రం, తడ, నాయుడుపేట, ఓజిలి, పెళ్ళకూరు మండలాలతో పాటు ఉదయగిరి, వరికుంటపాడు మండలాల్లోని ఎనిమిది గ్రామాల్లో ధాన్యం సేకరణ కేంద్రాలు ఏర్పాటుచేశామని ఆమె వివరించారు. గ్రేడ్-ఏ ధాన్యానికి క్వింటాలుకు 1960 రూపాయలు, సాధారణ రకం ధాన్యానికి 1940 రూపాయలను ప్రభుత్వం మద్దతుధరగా నిర్ణయించిందని తెలిపారు.

# సునామీలా... దూసుకొస్తున్న కరోనా

(మొదటి పేజీ తరువాయి)

దొరికినవారిని దొరికినట్లుగా నిర్ధాక్షిణ్యంగా నంజుకుతింటోంది. ఇప్పుడు ఒమిక్రాన్ రూపంలో విరుచుకుపడుతున్న ఈ వ్యాధి, రానురాను ఇంకా రకరకాల రూపాలతో మరింత తీవ్రంగా ముంచుకొచ్చే ప్రమాదం కూడా ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఇప్పటికి రెండు వేవ్‌లు అయ్యాయి. థర్డ్‌వేవ్ ఇప్పుడు పంజా విసురుతోంది. ఇంకెన్ని వేవ్‌లు ఉన్నాయో..ఈ విషపు వ్యాధి పీడ ఎప్పటికి విరగడవుతుందోనని ప్రపంచమంతా ప్రాణాలు అరచేతపట్టుకుని బిక్కుబిక్కుమంటూ దిక్కులు చూస్తోంది.

కరోనా..ఒమిక్రాన్ వేరియంట్‌లు ప్రపంచాన్ని అతలాకుతలం చేస్తున్నాయి. ఈ వ్యాధి బారినపడి నిత్యం లక్షలాదిమంది ప్రజలు అల్లాడిపోతున్నారు. అన్నిదేశాలతో పాటు మనదేశంలోనూ కోవిడ్ విలయతాండవం చేస్తోంది. ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా కోవిడ్‌తో బాధపడుతున్నవారి సంఖ్య దాదాపు 34కోట్ల దాకా ఉంది. మృతుల సంఖ్య 60 లక్షలకు చేరువలోకి వస్తోంది. ఈ వ్యాధికి గురైన మరో లక్షమంది పరిస్థితి విషమంగా ఉంది. ప్రపంచవ్యాప్తంగా ఇంతపెద్దఎత్తున ఒక వ్యాధి ప్రజల ప్రాణాలు తీస్తుండడం ఎవరూ ఊహించలేనిది. ఎప్పుడూ కనీవినీ ఎరుగనిది. ప్రపంచంలో మెరికలైన వైద్యబృందాలు రేయింబవళ్ళు కష్టించి పనిచేస్తూ కరోనా ఆటకట్టించాలని ఎంతగానో ప్రయత్నాలు చేస్తున్నా, ఈ మాయలమారి వ్యాధి ఎప్పటికప్పుడు వేషం మార్చుకుని ఉప్పెనలా ముంచుకొస్తూనే ఉంది. ఈ విషపువ్యాధి అంతకంతకూ పెరుగుతున్నదే తప్ప ఏమాత్రం తగ్గడం లేదు.

### 24 గంటల్లోనే దేశంలో 2.82 లక్షల కేసులు :

మనదేశంలో కరోనా మరింతగా విజృంభిస్తూనే ఉంది. ఒక్క బుధవారం రోజునే.. కేవలం 24 గంటల్లోనే 2.82లక్షలకుపైగా ప్రజలు కరోనా బారినపడ్డారు. కరోనా ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటిదాకా దేశంలో 3.79కోట్లకుపైగానే కేసులు ఉండడమే కాక మృతుల సంఖ్య 4.87 లక్షల మందికి పైగానే ఉందంటే మనదేశంలో ఈ వ్యాధి ఎంతగా చెలరేగిపోతోందో తేటతెల్లమవుతోంది. నిత్యం లక్షలాదిమంది వైద్యుల చికిత్సలతో కోలుకుంటున్నా కొత్తగా కరోనా అంటుకునే కేసులు కూడా లక్షల్లోనే ఉంటున్నాయి. కరోనా మహమ్మారి ముంచుకురావడంతో దేశంలోని అన్ని వ్యవస్థలు కుదేలైపోతున్నాయి. ముఖ్యంగా ఆర్ధికవ్యవస్థ చిన్నాభిన్నమైపోతోంది. దీంతో కోట్లాదిమంది పేదలు, కార్మికులు, కర్షకులు నరకయాతన అనుభవిస్తున్నారు. కోవిడ్ సోకిన కుటుంబాల వారైతే వారి బాధలు వర్ణనాతీతం. కోవిడ్‌తో మృతిచెందిన కుటుంబాల వారి కష్టాలు ఆ దేవుడికే ఎరుక. కోవిడ్ ఇంకా ఎంతమంది జీవితాలను నాశనం చేస్తుందోనని ప్రతిఒక్కరూ భయపడుతున్నారు. ఎప్పటికప్పుడు స్వీయరక్షణ చర్యలు, కోవిడ్ నిబంధనలు తప్పనిసరిగా పాటిస్తుండాలని, తద్వారా ఈ వ్యాధికి దూరంగా ఉండాలని ప్రభుత్వాలు పదేపదే హెచ్చరిస్తున్నాయి. కోవిడ్ వ్యాక్సిన్ దేశవ్యాప్తంగా జరుగుతూనే ఉన్న నేపథ్యంలో అన్ని ప్రాంతాల వారు వ్యాక్సిన్ వేసుకోవాలని, రెండు డోసులు వేసుకున్నవారు మూడవ బూస్టర్ కూడా వేసుకోవాలని ప్రభుత్వాలు స్పష్టం చేస్తున్నాయి.

### ఏపీపై ఒమిక్రాన్ పంజా :

ఆంధ్రప్రదేశ్‌పై కూడా ఒమిక్రాన్ పంజా విసురుతోంది. ఈనెల 1 నుంచి రాష్ట్రంలో దీని ఉధృతి కొనసాగుతోంది. మొన్నమొన్నటిదాకా వందల్లో ఉన్న కేసులు, ఇప్పుడు వేలల్లో వస్తున్నాయి. కరోనా కేసుల్లో ఎక్కువశాతం ఒమిక్రాన్ వేరియంట్‌దేనని సమాచారం. అంతకుముందున్న డెల్టా, డెల్టా ప్లస్‌ల వేరియంట్‌ల కంటే ఒమిక్రాన్ వేరియంట్ ఇప్పుడు మరింత ప్రమాదకరంగా తయారైంది. ఇది శరవేగంగా వ్యాపిస్తోంది. ఈనెల 19న ఒక్కరోజే 10వేలకుపైగా కేసులు పెరిగిపోయాయంటే ఇది ఎంతగా విజృంభిస్తోందో అర్ధమవుతుంది. అదేరోజున 8 మంది మరణించడం కూడా జరిగింది. ప్రత్యేకించి చిత్తూరు, విశాఖపట్నం జిల్లాల్లో అత్యధికంగా కేసులు వస్తున్నాయి. ఈ ప్రాణాంతకవ్యాధి నుంచి బయటపడేందుకు ప్రతి ఒక్కరూ మాస్కులు ధరిస్తూ కోవిడ్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని వైద్యబృందాలు సూచిస్తున్నాయి. కోవిడ్ థర్డ్‌వేవ్ ముంచుకొచ్చేసింది కనుక ప్రతిఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని వైద్యులు చెప్తున్నారు.

### నెల్లూరు జిల్లాను వణికిస్తున్న కరోనా :

కరోనా వ్యాధి నెల్లూరుజిల్లాను వణికిస్తోంది. ఇప్పటిదాకా ఈ వ్యాధికి మొత్తం లక్షా 51 వేలా 372 మంది గురికాగా, అందులో 1063 మంది దాకా ప్రాణాలు కోల్పోయారు. వైద్యుల పుణ్యమా అంటూ 1,46,306 మంది బాధితులు ఈ వ్యాధినుంచి కోలుకుని బయటపడ్డారు. ఇక కరోనా ఉధృతి తగ్గిపోతుందిలే అనుకుంటున్న తరుణంలో ఈ విషపువ్యాధి మళ్ళీ తీవ్రరూపం దాల్చింది. ఈనెల 20న ఒక్కరోజే కొత్తగా 1012 మందికి కరోనా సోకింది. దీంతో ఆసుపత్రుల్లో చేరుతున్నవారి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. నెల్లూరు పెద్దాసుపత్రి కోవిడ్ వ్యాధిగ్రస్తులతో కిటకిటలాడుతోంది. కేవలం 21 రోజుల్లో కోవిడ్ యాక్టివ్ కేసుల సంఖ్య 4వేల దాకా పెరిగింది. ప్రజల ప్రాణాలు తీస్తున్న ఈ మాయదారి జబ్బు పట్ల ప్రతిఒక్కరూ జాగ్రత్తలు పాటిస్తూ అప్రమత్తంగా ఉండడమే తప్ప మార్గాంతరం లేదు.

# శ్రీ రాజరాజేశ్వరి ఆలయంలో.. సిఎం ఓఎస్డీ దంపతులు



రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఓయస్డీ కృష్ణమోహన్‌రెడ్డి దంపతులు ఈనెల 16న నెల్లూరు దర్గామిట్టలో కొలువై ఉన్న శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు వీరిని సాదరంగా స్వాగతించి పూజలు చేయించారు. వీరివెంట జిల్లా రెవెన్యూ అధికారి చిన్నఓబులేశు, ఆర్డీఓ హుస్సేన్‌సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

## 'సహకార' పాలకవర్గాల కాలపరిమితి..

# మరో 6 నెలలు పొడిగింపు

నెల్లూరు జిల్లా కేంద్ర సహకారబ్యాంకు (ఎన్‌డిసిసిబి), జిల్లా కోఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ (ఎన్‌డిసిఎంఎస్) ల ప్రస్తుత పాలకవర్గాల కాలపరిమితిని మరో ఆరునెలలు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 17న ఉత్తర్వులిచ్చింది. దీంతో ఎన్‌డిసిసిబి ఛైర్మన్‌గా కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, ఎన్‌డిసిఎంఎస్ ఛైర్మన్‌గా వీరి చలపతిరావు పదవీకాలం పెరిగింది. వీరి పాలకవర్గ కాలపరిమితి జనవరి 16తో ముగియగా, తాజా ఉత్తర్వులతో ఈ ఏడాది జులై 22వ తేది వరకు పదవీకాలం పొడిగింపు జరిగింది.

# పిఆర్‌సిపై ఉద్యమానికి.. ఏబిఆర్ఎస్ఎం మద్దతు

పిఆర్‌సిపై ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు చేస్తున్న ఉద్యమానికి అఖిల భారతీయ రాష్ట్రీయ సైక్షిక్ మహాసంఘ్ (ఏబిఆర్ఎస్ఎం) మద్దతు పలుకుతున్నట్లు ఈనెల 14న ఆ సంఘం రాష్ట్ర కన్వీనర్ ప్రొ.వైవి రామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పిఆర్‌సి నివేదికను బహిర్గతం చేయాలని, సిపిఎస్ రద్దుచేయాలని, పెండింగ్‌లో ఉన్న 5 డిఏలను విడుదల చేయాలని, హెల్త్‌కార్డులు, పింఛనర్లకు రావాల్సిన బకాయిలు వెంటనే చెల్లించాలని, లేనిపక్షంలో ప్రభుత్వ ఉపాధ్యాయులు చేస్తున్న ఉద్యమంలో తమ సంఘం కూడా పాల్గొంటుందని పేర్కొన్నారు.

# విజ్ఞానభారతి ఆధ్వర్యంలో రంగవల్లుల పోటీలు


బహుమతులు అందజేస్తున్న సర్పంచ్ అమరావతి

సంక్రాంతి పర్వదినం సందర్భంగా విజ్ఞానభారతి సంస్థ ఆధ్వర్యంలో ఇటీవల కోవూరు మండలంలోని వేగూరులో ముగ్గుల పోటీలు నిర్వహించారు. అక్కడి కోదండరామస్వామి దేవాలయంలో జరిగిన ఈ పోటీల్లో విజేతలకు సర్పంచ్ కరేటి అమరావతి చేతులమీదుగా బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో విజ్ఞానభారతి నిర్వాహకులతో పాటు ఉపాధ్యాయులు మురళీధర్, రాధ తదితరులు పాల్గొన్నారు.

## రక్తదానంతో..

# ప్రాణాలు కాపాడారు

**క్షణాల్లో స్పందించిన చిరంజీవి సేవాసంఘం**

కాలేయవ్యాధితో బాధపడుతున్న ఒక రోగికి అత్యవసరంగా మూడు యూనిట్ల రక్తం అవసరం కావడంతో ఆ సమాచారం అందుకున్న సూళ్ళూరుపేటలోని చిరంజీవి సేవాసంఘం సభ్యులు వెంటనే స్పందించి రక్తదానం చేసి రోగి ప్రాణాలు కాపాడారు. చెన్నైలోని స్టాన్లీ ఆసుపత్రిలో చికిత్స పొందు తున్న బాధితునికి రక్తదానం చేయడానికి ఆ సంఘం అధ్యక్షుడు మహబూబ్‌బాషా ఆధ్వర్యంలో శరవణ, రామ్‌సాయి అక్కడి ఆసుపత్రికి వెళ్ళి రక్తదానం చేశారు. అత్యవసర సమయంలో రక్తం అందించి రోగి ప్రాణాలు కాపాడిన సంఘ సభ్యులందరినీ స్థానికులు అభినందించారు.

# మాతమ్మగుడిలో చోరీ

మనుబోలు మండలం, వెంకన్న పాళెంలో ఉన్న మాతమ్మగుడిలో ఇటీవల దొంగలుపడ్డారు. గుడి తాళాలు పగుల గొట్టి హుండీని అపహరించుకుపోయారు. హుండీలో కనీసం పదివేల రూపాయల దాకా ఉండొచ్చని భావిస్తున్నారు. చోరీ జరిగిన విషయం గుర్తించి గ్రామస్తులు పోలీసులకు ఫిర్యాదుచేయగా, పోలీసులొచ్చి విచారణ చేపట్టారు. గుడికి కొద్దిదూరంలో ఉన్న సబ్‌స్టేషన్ వద్ద హుండీని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు.

## రంగనాథస్వామి దేవాలయంలో..

# నేత్రపర్వంగా భోగి కల్యాణం



భోగి పండుగను పురస్కరించుకుని ఈ నెల 14న నెల్లూరు లోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీ తల్పగిరి రంగనాథస్వామి దేవాలయంలో భోగి కల్యాణమహోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణా న్నంతా పూలమాలతో అలంకరించారు. ఆలయ అర్చకులు స్వామివారిని, అమ్మవార్లను శోభాయమానంగా అలంకరించి విశేషపూజలు చేశారు. అనంతరం భోగి కల్యాణాన్ని చేపట్టారు. ఆలయ ఛైర్మన్ ఇలపాక శివకుమార్‌ఆచారి, ధర్మకర్తల మండలి సభ్యులు శివగామి, రమాదేవి పర్యవేక్షణలో జరిగిన ఈ కల్యాణోత్సవంలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని, అమ్మవార్లను దర్శించుకున్నారు.

# జనసేనను పటిష్ఠం చేయాలి

**కార్యకర్తలకు నాయకుల పిలుపు**

జనసేన పార్టీని పటిష్ఠం చేసుకోవాలని, అందుకు కార్యకర్తలు, స్థానిక నాయకులంతా క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేయాలని ఆ పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. జిల్లాలోని వరికుంటపాడు మండలంలో ఉన్న 24 పంచాయతీలకు చెందిన జనసేన పార్టీ వారు ఇటీవల వరికుంటపాడులో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు రసూల్‌పఠాన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో మండల కమిటీ నిర్మాణం గురించి చర్చించారు. యువతకు పార్టీలో ఎంతో ప్రాధాన్యత ఉంటుందని చెప్పారు. జనసేన స్థానిక నాయకులు కొండయ్య, రాఘవేంద్రరావు, నితీష్‌రెడ్డి, సోను, మాధవ్, జగదీష్, ప్రభాకర్, కార్తీక్‌తో పాటు జనసేన అధినేత పవన్‌కల్యాణ్ అభిమానులు, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

# అమలులోకి రాత్రి వేళల్లో కర్ఫ్యూ

కరోనా వ్యాప్తి తీవ్రమవుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో ఆ వ్యాధిని నియంత్రించేందుకు ప్రభుత్వ ఆదేశాల ప్రకారం జిల్లాలో రాత్రివేళల్లో కర్ఫ్యూ విధించారు. ఈనెల 18 నుంచి కర్ఫ్యూ అమలులోకి వచ్చింది. రాత్రి 11 నుంచి 5 గంటల వరకు కర్ఫ్యూ అమల్లో ఉంటుందని నెల్లూరు ఆర్డీఓ హుస్సేన్‌సాహెబ్ తెలిపారు. కొన్ని అత్యవసర సేవలకు మాత్రం మినహాయింపు ఉంటుందని, అందులో ఆసుపత్రులు, వైద్యపరీక్షలు, ఫార్మసీ రంగాలతో పాటు ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా, టెలికమ్యూనికేషన్లు, ఇంటర్నెట్ సర్వీసులు, ప్రసార సేవలు, ఐటీ సంబంధిత సేవలు, పెట్రోల్ బంకులు, విద్యుత్ ఉత్పత్తి, పంపిణీ వ్యవస్థలు, నీటి సరఫరా, పారిశుద్ధ్య వ్యవస్థలకు ఆ మినహాయింపు ఇస్తున్నామని పేర్కొన్నారు. బస్టాండు, రైల్వేస్టేషన్ల నుంచి వచ్చే ప్రయాణీకులు తగు ఆధారాలు చూపించి కర్ఫ్యూ సమయంలో తమ గమ్యస్థానాలకు చేరుకోవచ్చన్నారు. ప్రతిఒక్కరూ కోవిడ్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు.


# భారీఎత్తున శ్రీగంధం అక్రమరవాణా

- పట్టుకున్న సూళ్ళూరుపేట పోలీసులు
- 35 లక్షలు విలువజేసే దుంగలు స్వాధీనం


పట్టుబడిన దుంగలు, స్మగ్లర్లతో గూడూరు డిఎస్పీ, సూళ్ళూరుపేట పోలీసులు

శ్రీగంధం చెట్లను అక్రమంగా నరికి వాటి దుంగలను తరలించుకుపోతున్న స్మగ్లర్లను సూళ్ళూరుపేట పోలీసులు ఇటీవల అత్యంత చాకచక్యంగా పట్టుకుని, నిందితులు తరలించుకుపోతున్న శ్రీగంధం దుంగలను స్వాధీనం చేసు కున్నారు. వాటి విలువ సుమారు 35 లక్షల రూపాయల దాకా ఉంటుందని అంచనా వేస్తున్నారు. కృష్ణపట్నం నుంచి చెన్నైకి ఈ దుంగలను తరలిస్తున్నారనే ముందస్తు సమాచారంతో పోలీసులు నిఘాపెట్టి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. సూళ్ళూరుపేట పోలీస్‌స్టేషన్‌లో గూడూరు డిఎస్పీ రాజగోపాల్‌రెడ్డి విలేకర్ల సమావేశం పెట్టి ఆ వివరాలు తెలిపారు. శ్రీగంధం దుంగలను తరలించుకుపోతున్నారనే సమాచారంతో సూళ్ళూరుపేట సిఐ వెంకటేశ్వర్లు, తడ, శ్రీహరికోట ఎస్ఐలు శ్రీనివాసులురెడ్డి, రోజాలత తమ సిబ్బందితో వాహనాల తనిఖీలు ముమ్మరం చేశారు. ఓ లారీని తనిఖీ చేయగా అందులో 484 శ్రీగంధం దుంగలు దొరికాయి. వాటితోపాటు ఆ లారీకి ముందు పైలెట్లుగా వచ్చిన రెండు కార్లను కూడా పోలీసులు పట్టుకున్నారు. లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. లారీ డ్రైవర్‌ను విచారించగా తీగలాగితే డొంకంతా కదిలింది. దీంతో ఈ స్మగ్లింగ్ వెనుక ఉన్న పలు ప్రాంతాలకు చెందిన వారిని కూడా పోలీసులు గుర్తించారు. గూడూరు మండలంలోని చెన్నూరుకు చెందిన ఆ లారీ డ్రైవర్ మునీంద్రను విచారించగా శ్రీగంధం స్మగ్లర్ల వివరాలు మరిన్ని తెలిశాయని డిఎస్పీ చెప్పారు. జిల్లాలోని అనంత సాగరం మండలం రేవూరు గ్రామానికి చెందిన మోడిబోయిన మురళీకృష్ణ, దగదర్తి ప్రాంతానికి చెందిన ఉప్పు రామచంద్రయ్య, నెల్లూరు నగరం భక్తవత్సల నగర్‌కు చెందిన కర్నాటి మాలకొండయ్య, గూడూరు మండలం మిట్టాత్మకూరుకు చెందిన కర్రా పెంచలయ్య, వెంకటగిరి మండలం సిద్ధాగుంటకు చెందిన కనియపల్లి వెంకటరమణయ్య, పొదలకూరు మండలం వనంతోపు ప్రాంతానికి చెందిన నల్లు మణి, రాపూరు మండలం గోనుపల్లికి చెందిన వెలుగు అంకయ్య ఈ అక్రమ రవాణా వెనుక ఉన్నట్లు తెలిసిందని, దీంతో ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటుచేసి గాలింపు చేపట్టి వారిని కూడా అరెస్ట్ చేశామని వివరించారు. ఈ స్మగ్లింగ్‌కు సహకరించిన లారీ డ్రైవర్‌ను, లారీని, వారికి తోడుగా పైలెట్లుగా వచ్చిన రెండు కార్లను కూడా స్వాధీనం చేసుకున్నామని, నిందితులు 8 మందిని అరెస్టు చేశామని ఆయన వివరించారు. ఇలాంటి అక్రమరవాణా కార్యకలాపాలను ఎట్టి పరిస్థితుల్లో సహించేది లేదని, తనిఖీలు మరింత ముమ్మరం చేయనున్నామని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

# కమనీయం..గోదాదేవి కల్యాణం



జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన రాపూరు మండలంలోని పెంచలకోన శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి దేవాలయంలో ఇటీవల గోదాదేవి కల్యాణం వైభవంగా జరిగింది. స్వామివారికి తిరుప్పావై, ధనుర్మాస ప్రత్యేకపూజలు చేశారు. స్వామివారి నిత్యకల్యాణ మండపంలో గోదాదేవి అమ్మవారిని, శ్రీ లక్ష్మీనృసింహస్వామిని కొలువుదీర్చి కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు.

# పండుగ రోజుల్లోనూ వానలు

**అకాల వర్షాలతో రైతన్నలకు బాధలు**

సంక్రాంతి పండుగ రోజుల్లో వర్షాలు కురవడం అరుదైన విషయం. వాతావరణ మార్పుల వల్ల గత వారం రోజులుగా జిల్లాలో అక్కడక్కడా చిరుజల్లులు, మరికొన్నిచోట్ల ఒకమోస్తరు వర్షం కురిసింది. దీంతో ఇళ్ళ ముంగిళ్ళలో పండగ ముగ్గులు వేసుకునేందుకు, చిన్నారులు గాలిపటాలు ఎగురవేసుకునేందుకు ఇబ్బందులు పడ్డారు. నెల్లూరు నగరం చిన్న వానకే మురికికూపంగా మారింది. ఈ అకాలవర్షాలకి రోడ్లన్నీ బురదమయమై..దుర్గంధపూరితమై ప్రజలు ఇబ్బందులు పడ్డారు. గూడూరు, కోట, వాకాడు, చిల్లకూరు తదితర మండలాల్లో వరినార్లు నీటమునిగి పోవడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. అదేవిధంగా వేరుశనగ పంట కూడా దెబ్బతినడం, పిందె దశలో ఉన్న మిరప పంటకు నష్టం వాటిల్లడంతో రైతులు లబోదిబో మంటున్నారు. వ్యవసాయ అధికారులు పరిశీలించి అకాల వర్షాలకు దెబ్బతిన్న తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

# కోవిడ్ కాల్‌సెంటర్లను సద్వినియోగం చేసుకోవాలి

నెల్లూరు కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన కోవిడ్ కాల్‌సెంటర్లను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారిణి రాజ్యలక్ష్మి ఒక ప్రకటనలో కోరారు. కరోనాపై ఏవైనా సందేహాలున్నా, ఆసుపత్రుల వివరాలు, పడకలు తదితర అంశాలపై సమాచారం కావాలన్నా 104, 1077 నంబర్లను సంప్రదిస్తే సంబంధిత వైద్యాధికారులు తగు సమాచారం అందిస్తారని పేర్కొన్నారు. అడ్మిషన్లు పొందేవారు 104 నెంబరుకు ఫోన్ చేస్తే వారికి బెడ్లు కూడా ఏర్పాటుచేస్తారన్నారు. ప్రతి మునిసిపాలిటీ, మండల కేంద్రాల్లో కూడా కోవిడ్ కాల్‌సెంటర్లు ఏర్పాటుచేసి ఉన్నారని, వాటిని ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు.



# ప్రజలకు బతకడం నేర్పించాలే కానీ..
# 'ఉచిత పథకాలు' సముచితం కాదు

## ○ ప్రజలను బద్ధకస్తులను చేయకూడదు
## ○ జనాకర్షక పథకాలతో ప్రమాదమే

**ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు**

***ప్రభుత్వాలు ప్రజలకు ఇస్తున్న ఉచిత పథకాల పట్ల భారత ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు తన అభిప్రాయాలను నిర్మొగమాటంగా..స్పష్టంగా చెప్పారు. ఉచిత పథకాలు సముచితం కాదన్నారు. పార్టీలు తాత్కాలిక జనాకర్షక పథకాలపైనే దృష్టిపెడుతున్నాయని, ప్రజలకు ఎలాంటి సౌకర్యాలు కల్పించాలో అలాంటి విషయాలను విస్మరిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన చేసిన ప్రసంగం ఆద్యంతం ఆలోచనాత్మకంగా సాగింది.***

'ప్రజలకు బతకడం నేర్పించాలి. వాళ్ళు తమ కాళ్ళపై తాము నిలబడేలా ప్రభుత్వాలు సహకరించాలి. అలా కాక అన్నీ ఉచితంగా ఇస్తూ బద్ధకస్తులను చేయకూడదు'.. అని ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు సూచించారు. ఈనెల 18న విజయవాడలోని ఆత్కూరులో ఉన్న స్వర్ణ భారత్ ట్రస్ట్‌లో విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమంలో మాట్లాడారు. జనాకర్షక పథకాలతో ప్రమాదమేనని హెచ్చరించారు. ప్రభుత్వాలు ప్రజల్లో నైపుణ్యాలను పెంచి వారికి ప్రోత్సాహకాలివ్వడం వంటివి చేయాలని హితవు పలికారు. ఆత్మ విశ్వాసం, కష్టపడే తత్వం, సానుకూల దృక్ఫథంతో ముందడుగు వేయాలని ఉద్బోధించారు. ప్రజాస్వామ్యంలో అధికార, ప్రతిపక్షాలు నిర్మాణాత్మకంగా వ్యవహరించాలని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో సేవామార్గాన్ని అవలంభించేందుకు, ప్రజలను కార్యోన్ముఖులను చేసేందుకు తాను స్వర్ణభారత్‌ను తరచూ సందర్శిస్తుంటానని, వారి కాళ్ళపై వారు నిలబడేందుకు, జీవనోపాధులు పొందేందుకు చేయూతనిస్తున్నామని అన్నారు. రైతులు, మహిళలు, యువతలో ప్రోత్సాహం కలిగించి శిక్షణ ఇవ్వడం ద్వారా వారికి మంచి ఉపాధి అవకాశాలు కల్పించడం స్వర్ణభారత్ ట్రస్టు లక్ష్యమన్నారు. యువతకు ఉపాధి కల్పించే ఉద్దేశంతోనే ప్రధాని నరేంద్రమోడీ ప్రత్యేకంగా కేంద్రంలో నైపుణ్యాభివృద్ధి మంత్రిత్వ శాఖను కూడా ఏర్పాటు చేశారన్నారు.

### మన భాషను మనం గౌరవించుకోవాలి

కన్నతల్లిని, జన్మభూమిని, మాతృ భాషను, స్వదేశాన్ని, మన గురువులను ఏనాటికీ విస్మరించకూడదని ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు అంటూ, మన భాషపై మనకు గౌరవం ఉండాలని, భాష పట్ల పట్టు సాధించుకోవాలని, అదే సందర్భంలో ఇతర భాషలంటే ద్వేషం పెంచుకోకూడదని స్పష్టం చేశారు. మన సంస్కృతికి మన భాష చిరునామా అన్నారు. భాషను పెంపొందించుకుంటే సంస్కృతి పరిఢవిల్లుతుందని చెప్పారు. కుటుంబ వ్యవస్థను కాపాడుకోవడంలో యువత ముందుండాలన్నారు. ఆనందమయ జీవితానికి సేవ అత్యున్నత సాధనమని సూచించారు.

## కుటుంబ వ్యవస్థను బలోపేతం చేసుకోవాలి



మన కుటుంబవ్యవస్థను, వివాహ వ్యవస్థను బలోపేతం చేసుకోవాలని, ఇది అందరి బాధ్యత అని వెంకయ్యనాయుడు తెలిపారు. ఎంతో విశిష్టమైన మన కుటుంబ, వివాహ వ్యవస్థల కారణంగానే మనదేశానికి ప్రపంచ వ్యాప్తంగా మంచి గుర్తింపు వచ్చిందన్నారు. ఈనెల 16న ఉప రాష్ట్రపతి చెన్నై పర్యటనలో భాగంగా కోట్టూర్‌పురంలోని తమ నివాసంలో సంక్రాంతి పండుగ జరుపుకున్నారు. అక్కడి నుంచి నెల్లూరులోని స్వర్ణభారత్ ట్రస్ట్ వారితో ఆన్‌లైన్‌లో మాట్లాడుతూ అందరికీ పండుగ శుభాకాంక్షలు చెప్పారు. భారతీయ సంస్కృతి సంప్రదాయాల ప్రకారం ప్రతి పండుగకు ఒక పరమార్థం ఉంటుందని, భోగిపండుగ, సంక్రాంతి, కనుమ పండుగలు కూడా కొత్తపంట చేతికొచ్చిన ఆనందంలో రైతులు చేసుకునేవేనని అన్నారు. మన జీవితానికి కారణమైన మన పెద్దలను, ఆనందకరమైన జీవనానికి కారణమైన సమాజాన్ని గౌరవించుకోవాలనే గొప్ప అంతరార్థం మన పండుగల్లో ఉందన్నారు. ఈ సంప్రదాయాలను పరిరక్షించుకోవాలని, వాటి ప్రాధాన్యతను భావితరాలకు తెలియజేసే బాధ్యతను పెద్దలు తీసుకోవాలని ఉప రాష్ట్రపతి ఈ సందర్భంగా కోరారు.

## స్నేహపూర్వక కలయిక



తనను స్నేహపూర్వకంగా కలవడానికి వచ్చిన చిత్తూరు జిల్లా కాణిపాకం 'స్వయంభు శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం' ఛైర్మన్ అగరం మోహన్‌రెడ్డిని గౌరవపూర్వకంగా సత్కరించి లాయర్ పత్రిక 40వ వార్షికోత్సవం సందర్భంగా ప్రచురించిన 'విజయపథంలో నెల్లూరీయులు' కాఫీ టేబుల్ పుస్తకాన్ని అందజేస్తున్న పత్రిక సంపాదకులు శివప్రభాత్‌రెడ్డి (ప్రభు )

## పురపాలక సంఘాలకు నిధులు

జిల్లాలో ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదలకు దెబ్బతిన్న ప్రాంతాలకు తాత్కాలిక మరమ్మతులు చేసేందుకు పురపాలక సంఘాలకు జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు ఇటీవల నిధులు మంజూరుచేశారు. జిల్లాలోని 6 పురపాలక సంఘాలు, 2 నగర పంచాయతీల్లో పనులు చేపట్టేందుకు 151.69 లక్షల రూపాయలను విడుదల చేశారు. ఈ నిధులతో కావలి, గూడూరు, నాయుడుపేట, వెంకటగిరి, సూళ్లూరుపేట, ఆత్మకూరు పురపాలక సంఘాల పరిధిలోను, బుచ్చిరెడ్డిపాళెం, అల్లూరు నగర పాలక పంచాయతీల్లోనూ అవసరమైన పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. పనులు చేపట్టేందుకు త్వరలో టెండర్లను పిలవనున్నారు.

## జిల్లాకు 10 పశువ్యాధి నిర్ధారణ కేంద్రాలు

జిల్లాకు నియోజకవర్గస్థాయిలో 10 పశువ్యాధి నిర్ధారణ కేంద్రాలు మంజూరయ్యాయని పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ మహేశ్వరుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కేంద్రాల్లో పనిచేసేందుకు ల్యాబ్ టెక్నీషియన్లు, ల్యాబ్ అటెండర్లను కూడా నియమించామన్నారు. పశువుల వ్యాధులను నిర్ధారించేందుకు ఎంతగానో ఉపయోగపడే ఈ కేంద్రాలను పశుపోషకులు అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.




Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com